
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 2 జనవరి 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:179



ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్ లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ప్రజా భవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.





హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్,రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ శ్రీమతి ప్రియాంక లు హైదరాబాద్ లోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ప్రజా భవన్.లో.టీపీసీసీ కాలెండర్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# 10 ఏళ్లలో తెలంగాణ కు నీళ్ల విషయం లో 100 ఏళ్ల నష్టం చేశారు






హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి జూరాల నుంచి పాలమూరు రంగారెడ్డి సోర్స్ శ్రీశైలం కు మార్చడానికి కేసీఆర్ మంత్రి వర్గ ఆమోదం తీసుకోలేదు .,ఈ విషయం బయట పడుతుందనే కేసీఆర్ అసెంబ్లీ కి రావడం లేదు..ఈ అంశం పైన ప్రభుత్వం విచారణ జరుపుతుంది..అందుకే హరీష్ రావు బనకచర్ల పైన మాట్లాడుతున్నాడు కేసీఆర్ అసెంబ్లీ కి రావాలి కేసీఆర్ గౌరవ మర్యాదలకు భంగం కలగనివ్వం..కేసీఆర్ తన అనుభవాన్ని సభ లో పంచుకోవాలి..కేసీఆర్,హరీష్ రావు 10 ఏళ్లలో తెలంగాణ కు నీళ్ల విషయం లో 100 ఏళ్ల నష్టం చేశారు..కేసీఆర్ కి శాశ్వత జల,రాజకీయ సమాధి కడతారనే విమర్శలు చేస్తున్నారు.. కేసీఆర్,హరీష్ రావు ను నీళ్ల విషయం లో ఉరి తీసినా తప్పు లేదు..ఆదిత్య నాథ్ దాస్ ను సలహాదారు గా నియమించడం పైన విమర్శలు చేస్తున్నారు..ఆదిత్య నాథ్ దాస్ తెలంగాణ ప్రాజెక్ట్ ల పైన 10 ఏళ్ళు పని చేశారు..అన్ని ప్రాజెక్ట్ పైన పూర్తి అవగాహన ఉంది..ఆయన నాకు బంధువు కాదు..తమ దొంగతనం బయట పడుతుందనే ఆదిత్య నాథ్ దాస్ పైన హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు..

## 25 డిసెంబరులో రూ.1.74 లక్షల కోట్ల జీఎస్టీ

ముంబై, జనవరి 1,(న్యూస్ పల్స్) దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,74,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2024 డిసెంబరులో నమోదైన రూ.1,64,556 కోట్లతో పోలిస్తే ఇది 6.1 శాతం అధికం కావడం గమనార్హం. పండుగల సీజన్ తర్వాత కూడా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయనడానికి ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.నెల వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ (అఉూ) వాటా రూ.34,289 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ (రాఉూ) వాటా రూ.41,368 కోట్లుగా ఉంది. ఇక ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఎఉూ) ద్వారా అత్యధికంగా రూ.98,894 కోట్లు వసూలయ్యాయి. రుణ బకాయిల చెల్లింపుల కోసం తాత్కాలికంగా కొనసాగిస్తున్న జీఎస్టీ పరిహార సెస్ రూపంలో ప్రభుత్వానికి మరో రూ.4,551 కోట్లు అందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ సెస్ ద్వారా మొత్తం రూ.88,385 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు, డిసెంబరులో జీఎస్టీ రిఫండుల రూపంలో రూ.28,980 కోట్లను ప్రభుత్వం వెనక్కి చెల్లించింది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40 శాతం వంటి కొత్త పన్నుల శ్లాబులు ప్రవేశపెట్టినప్పటికీ, పొగాకు, పాన్ మసాలా వంటి వాటిపై సెస్ కొనసాగుతోంది. సెప్టెంబర్ 22 నుంచి కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించినప్పటికీ, వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడం వల్ల వసూళ్లు పెరగడం విశేషం.ఇదే సమయంలో, పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) చట్టం-2025 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం పొగాకు ఉత్పత్తులపై కొత్త ఎక్సైజ్ సుంకం రేట్లను నిర్దేశిస్తుంది. దీనితో పాటు, పాన్ మసాలా తయారీపై సెస్ విధించే హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ యాక్ట్, 2025 కూడా అదే తేదీ నుంచి అమల్లోకి రానుంది.




## తెలంగాణా నదీ జలాలకు మరణశాసనం రాసిందే బి.ఆర్ ఎస్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసమే పి.ఆర్.ఎల్.ఐ.సి నీటి సామర్థ్యాన్ని 1 టి.యం.సి కి కుదింపు ఆంధ్రప్రదేశ్ తో హోలయ్ బలయ్ చేసుకుని తెలంగాణా ప్రయోజనాలను తాకట్టు పెట్టారు కృష్ణా జలాశయాలలో 763 టి.యం.సి లు తెలంగాణాకు కేటాయించాల్సిందే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుండి శ్రీశైలం ఎందుకు మార్చారు పి.ఆర్.ఎల్.ఐ. సి 90 పూర్తి అయిందనడం వాస్తవం కాదు ప్రాజెక్టును పూర్తి చేయాలి అంటే 80 వేల పై చిలుకు వ్యయం అవుతుంది 2015 లో ఈ ప్రాజెక్టును పూర్తికి 35 వేల కోట్లతో అంచనా వేశారు 2022 లో సి.డబ్ల్యు.సి కి ఇచ్చిన డి పి ఆర్ లో భూసేకరణ, కాలువల నిర్మాణం లేకుండానే 55 వేల కోట్లకు పెంచారు పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో పి.ఆర్.ఎల్.ఐ సి మీద పెట్టిన ఖర్చు 27 వేల కోట్లు మాత్రమే రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మా ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తం 7 వేల కోట్లు జూరాల వద్దే కొనసాగితే ఇంత వ్యయం ఉండదు 90 టి.యం.సి ల నీటితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి కట్టుబడి ఉన్నాం జలాశయాలలో తెలంగాణ వాటా పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి చర్యలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ లో వాదనలు గట్టిగా విపిస్తున్నాం కృష్ణా జలాశయాలలో తెలంగాణా ప్రభుత్వం గట్టిపట్టు పడుతుందనడానికి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి చంద్రబాబు కు రాసిన లేఖే నిదర్శనం కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురి అయ్యింది నదీ జలాల అంశంపై బి.ఆర్.ఎస్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితం-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాబలం

2 జనవరి 2026 శుక్రవారం

## వడివడిగా టాప్ 3 అడుగులు..

భారత్ 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 8.2 శాతం వృద్ధి రేటుతో ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు పొందిన భారత్.. 2030 నాటికి జర్మనీని సైతం వెనక్కి నెట్టి మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ వినియోగం, ప్రభుత్వ సంస్కరణలే ఈ చారిత్రక విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని నిపుణులు చెబుతున్నారు.ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంపై భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. తన అద్భుతమైన వృద్ధి పథంతో జపాన్‌ను వెనక్కి నెట్టి.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన విడుదల చేస్తూ.. దేశ ఆర్థిక బలం 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు అమెరికా, చైనా, జర్మనీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు.. మూడో స్థానంలో ఉన్న జర్మనీని వెనక్కి నెట్టేందుకు భారత్ ఉవ్విళ్లూరుతోంది.ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా అగ్ర స్థానంలో కొనసాగుతోంది. రెండో స్థానంలో చైనా ఉంది. తాజాగా జపాన్‌ను అధిగమించిన భారత్ నాలుగో స్థానానికి చేరుకుని.. ఇక మూడో స్థానంలో ఉన్న జర్మనీకి గట్టి పోటీనిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత్ 8.2 శాతం అద్భుతమైన వృద్ధిని సాధించింది. అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితులు ఉన్నప్పటికీ.. దేశీయంగా ప్రైవేట్ వినియోగం భారీగా పెరగడం, పటిష్టమైన ఆర్థిక సంస్కరణల వల్ల ఈ విజయం సాధ్యమైందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ఇదే వేగాన్ని కొనసాగిస్తే.. రాబోయే 2.5 నుంచి 3 ఏళ్లలోనే జర్మనీని వెనక్కి నెట్టి.. 2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించడం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, మూడీస్ కూడా భారత ఆర్థిక వృద్ధిపై ప్రశంసలు కురిపించాయి.ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం, నిరుద్యోగిత శాతం తగ్గడం, ఎగుమతులు భారీగా పెరగడం వంటి అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయి. రాబోయే నాలుగేళ్లలో అంటే 2030 నాటికి భారత్ 7.3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఎకానమీగా ఎదుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వేగవంతమైన పురోగతి అమెరికా, చైనా వంటి దేశాల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. భారత్ జీడీపీ పెరుగుదల రేటు ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండటం ఈ మార్పుకు కారణం.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థను 'స్థిరంగా లేని' డెడ్ ఎకానమీ అని విమర్శించారు. ట్రంప్ వ్యాఖ్యలకు మన దేశంలోని విపక్ష నేతలు వంత పాడారు. అయిత ఎవరేమన్నా.. దేశ ఆర్థిక పురోగతి మాత్రం ఆగడం లేదు. వేగంగా దూసుకుపోతోంది.భారత ఆర్థిక బలోపేతాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో అమెరికా అధిక టారిఫ్‌లు విధించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో పెరిగిన ఉద్రిక్తతలకు సూచిక. చైనా కూడా అంతర్గత సమస్యలు, సరిహద్దు విషయాల్లో భారత్‌ను రెచ్చగొడుతోంది. పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లను ఉత్తేజపరచడం ఈ వ్యూహంలో భాగమే.భారత ప్రభుత్వం రక్షణ, ఆర్థిక రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెంచుతోంది. స్వయం సమృద్ధి, ఆధునికీకరణ కార్యక్రమాలు దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలు ప్రపంచ శక్తులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. భారత్ పొరుగు దేశాల్లో ప్రభావం పెంచుకునేందుకు కృషి చేస్తున్నారు.అమెరికా, చైనా భారత ఆర్థిక ఆవిష్కరణలను సహించలేకపోతున్నాయి. పొరుగు దేశాలపై పన్నులు, రాజకీయ ఒత్తిడి ద్వారా భారత్‌ను అడ్డుకోవాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ భారత్ అడుగులు ఆపకుండా ముందుకు సాగుతోంది. 2030 నాటి మూడో స్థానం ఈ పోరాటంలో విజయానికి చిహ్నం.2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో.. దేశ స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో బలమైన నిర్మాణాత్మక సంస్కరణలు, సామాజిక పురోగతి దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఇక భారత్ ఇకపై కేవలం విదేశీ సహాయం పొందే దేశం కాదు. గత కొన్ని సంవత్సరాలుగా ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా అవతరించింది. అనేక దేశాలకు ఆర్థిక సహాయం, రుణాలను అందిస్తోంది. బడ్జెట్ గణాంకాల ప్రకారం.. భారత్ నుండి అత్యధిక ఆర్థిక సహాయం పొందిన దేశం భూటాన్. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భూటాన్ దాదాపు రూ.2,068.56 కోట్ల సహాయం పొందింది. అయితే ఈ మొత్తం గత సంవత్సరం కంటే కొంచెం తక్కువ. 2023-24లో భూటాన్ కోసం సవరించిన సంఖ్య రూ.2,398.97 కోట్లు. భూటాన్ తర్వాత నేపాల్, మాల్దీవులు, మారిషస్ వంటి దేశాలు భారతదేశం సహాయ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి.భూటాన్‌కు రూ.2,068.56 కోట్లు, నేపాల్‌కు రూ.700 కోట్లు, మాల్దీవులకు రూ.400 కోట్లు ఇచ్చింది. అదనంగా మారిషస్‌కు రూ.370 కోట్లు, మయన్మార్‌కు రూ.250 కోట్లు, శ్రీలంకకు రూ.245 కోట్లు కేటాయించారు. ఆఫ్ఘనిస్తాన్, ఆఫ్రికన్ దేశాలు రూ.200 కోట్లు అందుకోగా, బంగ్లాదేశ్ రూ.120 కోట్లు, సీషెల్స్ రూ.400 కోట్లు, లాటిన్ అమెరికన్ దేశాలు రూ.300 కోట్లు అందుకుంటాయి.మనం అనేక దేశాలకు రుణాలు ఇవ్వడంతో పాటు ఇతర దేశాల నుంచి మనం కూడా రుణాలు తీసుకుంటున్నాం. మార్చి 2020 చివరి నాటికి భారతదేశం బాహ్య రుణం దాదాపు రూ.558.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది ప్రధానంగా వాణిజ్య రుణాలు, డిపాజిట్ల నుండి పెద్ద మొత్తంలో సహకారం కారణంగా ఉంది. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతదేశం ఓటఇ రంగం, ఆరోగ్యం, విద్య వంటి కీలకమైన సేవలకు మద్దతు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి కూడా రుణాలు తీసుకుంది.





జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి ) ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.రోహిత్ ముదిరాజ్ , ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ బి.సౌజన్యాగౌడ్ శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడే ( 2 వ తేదీన). చిక్కడపల్లి - లింక్ బ్రిడ్జి కి ప్రారంభోత్సవం

జస్ట్ పది నిమిషాలలోనే....చిక్కడపల్లి నుంచి లిబర్టీ చేరుకోవచ్చు.

- కొత్త సంవత్సరంలో తొలి ప్రారంభం కాబోతున్న తొలి బ్రిడ్జి ఇదే.

-ఈ నెల 2 వ తేదీన ( నేడు) లింక్ బ్రిడ్జిను ప్రారంభించనున్న చెబుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



-లిబర్టీకి వెళ్లే పరిసర ప్రాంతవాసులకు ఈ మార్గం ఉపయోగకరంహైదరాబాద్ 01, జనవరి 2026:అశోక్ నగర్ నుంచి దోమలగూడ హుస్సేన్ సాగర్ నాలా లింక్ బ్రిడ్జి పనులు ఇప్పటికే పూర్తి కాగాఈ లింక్ బ్రిడ్జి ను ఈ నెల 2 వ తేదీన జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్, డిప్యూటీ మేయర్ లతో కలిసి ప్రారంభించనున్నారు. చిక్క దపల్లి నుంచి అశోక్ నగర్, దోమలగూడను కలిపే లింక్ బ్రిడ్జి మీదుగా దోమలగూడ నుంచి లిబర్టీ జీహెచ్ ఎంసీ ఆఫీస్ వరకు ఈ బ్రిడ్జి కొనసాగనుంది. 2 కిలో మీటర్ల వరకు విస్తరించిన ఉన్న ఈ బ్రిడ్జిపై వెళ్తే కేవలం 10 నిమిషాల్లో లిబర్టీకి చేరుకోవచ్చు.ఈ మార్గంలో ఎలాంటి సిగ్నల్స్ ఉండవు . రూ.6కోట్ల వ్యయంతో 2023లో పనులు ప్రారంభమయ్యాయి. 48మీటర్ల విస్తీర్ణంతో ప్రధాన బ్రిడ్జి నిర్మాణం.× ప్రధాన బ్రిడ్జి 48 మీటర్ల విస్తీర్ణంతో నిర్మించారు. దోమలగూడ వైపు నుంచి లిబర్టీకి వెళ్లే ర్యాంపును 38 మీటర్లతో నిర్మించారు. అశోక్ నగర్ వైపు నుంచి వెళ్లే వారికి 22 మీటర్లతో ర్యాంపును నిర్మించారు. చిక్కడపల్లి సుధా టల్ నుంచి త్యాగరాయ గానసభ, నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్ నగర్ నుంచి లిబర్టీకి చేరుకోవచ్చు. దోమలగూడ సూరజ్ గర్ కాలనీ నుంచి గగన్ మహల్, లిబర్టీ జీహెచ్ఎం సీ కార్యాలయం వరకు నేరుగా వెళ్లొచ్చని జీహెచ్ ఎంసీ ప్రాజెక్ట్ ఏఈ ప్రశాంత్ తెలిపారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ







హైదరాబాద్ 01, జనవరి 2026:ఆంగ్ల నూతన సంవత్సర ను పురస్కరించుకుని కమిషనర్ శ్రీ ఆర్ వి కర్ణన్ కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ లు , జోనల్ కమిషనర్ లు ,విభాగాల అధిపతులు, డిప్యూటీ, ఉద్యోగులు , సిబ్బంది కమిషనర్ కు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో అదనపు కమిషనర్ లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్,వినయ్ కృష్ణా రెడ్డి, రఘు ప్రసాద్, సుభద్ర దేవి,వేణుగోపాల్ రెడ్డి, పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ , జోనల్ కమిషనర్ లు సంచిత్ గంగ్వార్, రాధిక గుప్తా, హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, ముకుంద రెడ్డి, ప్రియాంక అలా, బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ చౌహాన్, చంద్రకళ, ఎన్.రవికిరణ్, శ్రీనివాస్ రెడ్డి, విజిలెన్స్ ఏఎస్పీ నరసింహా రెడ్డి,సీసీపి శ్రీనివాస్,చీఫ్ ఇంజనీర్ లు భాస్కర్ రెడ్డి, సహదేవ్ రత్నాకర్, జ్యోతి , నిత్యానందు, ఎస్ఈ గోపాల్చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్ వెంకటేశ్వర రెడ్డి, ఫైనాన్సియల్ అడ్వైజర్ శరత్ చంద్ర, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, అసిస్టెంట్ ఫుడ్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ మూర్తి రాజు, కంట్రోల్ రూం శీంని అనురాధ,ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ఉద్యానవన అధికారి సునంద, కమిషనర్ పేషీ పిఎస్ రమణ, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టులకు టీజేఎఫ్ అండగా ఉంటుంది

### టి యు డబ్ల్యూ జే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

### ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు తిరిగి రెండోసారి ఎన్నిక

### అట్ట హాసంగా న్యూ ఇయర్ వేడుకలు






**ఖమ్మం ప్రతినిధి జనవరి 01 (ప్రజాబలం)** ఖమ్మం జర్నలిస్టులకు ఏ కష్టం వచ్చినా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టిజెఎఫ్ అండగా ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోటి ఆదినారాయణ అన్నారు నూతన సంవత్సర సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం న్యూ ఇయర్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజేఎఫ్ )జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి హాజరయ్యారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు న్యూ ఇయర్ కేక్ ను కట్ చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారుఅనంతరం ప్రెస్ క్లబ్ కమిటీ (టీజేఎఫ్) మహాసభ గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన ఎంతటి కష్టం వచ్చినా తమ యూనియన్ అండగా నిలుస్తుందని అన్నారు. ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డుల ఇతర జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో పాలక పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేసే ఉద్యమాలలో తమ యూనియన్ ముందుంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఆందోళన కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ కమిటీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో ప్రెస్ క్లబ్ సుందరంగా రూపు దిద్దుకుందని ఇదే సమిష్టి కృషితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు తిరిగి రెండోసారి ఎన్నిగురువారం జరిగిన ప్రెస్ క్లబ్ కమిటీ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ (టీజేఎఫ్) కమిటీ అధ్యక్షులుగా గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ముత్యాల కోటేశ్వరరావు, పోన్నేబోయిన పానకాలరావు, వి5 యాదగిరి, దండాల ప్రభాకర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ .వెంకట్ రెడ్డి సహాయ కార్యదర్శులుగా మూల జీవన్ రెడ్డి ఉల్లోజు రమేష్ ప్రచార కార్యదర్శులుగా నల్లమోతు శ్రీనివాస్ కూరపాటి నరేష్, పులి శ్రీను, ఈసీ మెంబర్లుగా ఎ .మురళి, లక్ష్మణ్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్,అప్పారావు, విశ్వ సేన రవీందర్, రోసి రెడ్డి, శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తోపాటు మొత్తం 21 మందితో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, సంతోష్, మహిళ ప్రతినిధి వంగూరి ఈశ్వరి, గోవింద్ ,నాయకులు పెంటి వెంకటేశ్వర్లు, వేణుగోపాల్,నాగరాజు, ఐలయ్య, ప్రసాద్ ఆదినారాయణ రవి తదితరులు పాల్గొన్నారు

## సగిలి ప్రకాష్ ఖమ్మం పీఠాధిపతులుచే ప్రత్యేక ప్రార్థనలు








ఖమ్మం ప్రతినిధి జనవరి 01 (ప్రజాబలం) ఖమ్మం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గుట్టల బజార్ సెయింట్ జోసెఫ్ చర్చి నందు ఖమ్మం కొత్తగూడెం ఉభయ జిల్లాల పీఠాధిపతులు సగిలి ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు వేలాదిమంది భక్తులు పాత సంవత్సరానికి వీడ్కోలు తెలుపుతూ కొత్త సంవత్సరానికి స్వాగతిస్తూ బాల యేసుని సన్నిధానంలో ప్రార్థనలు చేశారు ఈ సందర్భంగా ఖమ్మం పీఠాధిపతులు సగిలి ప్రకాష్ మాట్లాడుతూ క్రైస్తవులుగా మనము అందరము యేసు క్రీస్తును అనుసరిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని అర్ధరాత్రి వేళ గుట్టల బజార్ సంఘంలో వేలాదిగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మీ ప్రార్థన జీవితం మాలాంటి వాళ్ళను కూడా ఉత్సాహపరుస్తుందని అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఏసుప్రభు యొక్క మార్గంలో నడిచి ఎందరికో సహాయ పడాలని పేర్కొన్నారు. ఆ బాల యేసు యొక్క దీవెనలు కుల మతాలతో సంబంధం లేకుండా అందరూ పొందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు తలపనేని అంతోని సిస్టర్స్ ,బ్రదర్స్ సంఘ పెద్దలు మరియు సంఘస్తులు పాల్గొన్నారు

### తనకు ప్రధాని ఆశీస్సులున్నాయంటూ ఈ-మెయిల్స్... కేసు నమోదు చేసిన సీబీఐ


తనకు ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు ఉన్నాయని, స్వదేశీ యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీలో సహాయం చేస్తానని చెప్పి పలు రక్షణ, పరిశోధన సంస్థలకు ఈ-మెయిల్స్ పంపిన వ్యక్తిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, దిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతానికి చెందిన నిశిత్ కోహ్లీ అనే వ్యక్తి ఈ వ్యవహారానికి పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది. నిందితుడు 2024 అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో డీఆర్‌డీవో, ఇస్రో, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వంటి కీలక సంస్థలతో పాటు అమెరికాలోని పెంటగాన్‌కు చెందిన ఓ నేవీ అధికారికి కూడా ఈ-మెయిల్స్ పంపాడు. ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా తన అర్హతలను ధ్రువీకరించారని, ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ఆశీర్వాదం ఉందని ఆ మెయిల్స్‌లో పేర్కొన్నాడు. ఈ ఈ-మెయిల్స్‌ను గుర్తించిన పీఎంఓ అధికారులు, ప్రధాని పేరును వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని భావించి సీబీఐకి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన సీబీఐ, నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఈ చర్యల వెనుక నిందితుడి అసలు ఉద్దేశాలను తెలుసుకునే పనిలో అధికారులు ఉన్నారు.

## ఈసీతో జనసేన ప్రతినిధుల భేటీ.. ఎన్నికల సంస్కరణలపై కీలక సూచనలు

దేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాజకీయ పార్టీలతో జరుపుతున్న సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా, గురువారం జనసేన పార్టీ ప్రతినిధుల బృందం ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ఈసీ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనసేన తరఫున పార్టీ ప్రతినిధులు ఇ. ప్రతాప్ కుమార్, ఆర్.ఎం.వి. సుమంత్ హాజరై, ఎన్నికల సంస్కరణలపై తమ పార్టీ తరఫున పలు సూచనలు అందజేశారు. అయితే, ఈసీకి సమర్పించిన ప్రతిపాదనల వివరాలను జనసేన పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనల పరిధిలోనే ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు, దేశంలోని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీల నుంచి ఈసీ సూచనలు స్వీకరిస్తోంది. 2025 మార్చిలోనే ఈ ప్రక్రియను ప్రారంభించిన ఎన్నికల సంఘం, అన్ని పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులతో పార్టీలు మరింత చురుకుగా పనిచేయాలని కూడా ఈసీ కోరుతోంది. ఇదే క్రమంలో, గత ఏడాది జులైలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతినిధుల బృందం కూడా ఈసీని కలిసి తమ సూచనలను సమర్పించింది. ఓటర్ల జాబితాలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పర్యవేక్షణలో ఏటా థర్డ్-పార్టీ ఆడిట్ నిర్వహించాలని టీడీపీ ఆనాడు ప్రతిపాదించింది. జాబితాలోని అవకతవకలను గుర్తించేందుకు ఇది దోహదపడుతుందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ముందుగానే ప్రారంభించాలని కోరింది.

అంతేకాకుండా, ఓటరు పేరును జాబితా నుంచి తొలగించాల్సి వస్తే, సరైన కారణాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయాలని, సంబంధిత ఓటరుకు ముందస్తు నోటీసు ఇచ్చి వివరణ తీసుకునే అవకాశం కల్పించాలని టీడీపీ స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా నిర్వహణలో నకిలీలు, వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను రియల్ టైంలో గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టూల్స్‌ను వినియోగించాలని కూడా సూచించింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ తరఫున, పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణ దేవరాయలు ఈ సూచనల లేఖను సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు అందజేశారు. తాజాగా టీడీపీ మిత్రపక్షమైన జనసేన కూడా తమ వంతు ప్రతిపాదనలు అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ని మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీజేపీలోకి దువ్వాడ...



శ్రీకాకుళం, జనవరి 1, దువ్వాడ శ్రీనివాస్ బీజేపీలో చేరుతారా? ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం దువ్వాడ శ్రీనివాస్ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. త్వరలో ఆయనపై శాశ్వత బహిష్కరణ జరుగుతుందని ప్రచారం నడుస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలుగా ఉన్న ధర్మాన బ్రదర్స్ పై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు దువ్వాడ. గతంలో కుటుంబ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో పార్టీ ఆయన పై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ హస్తం ఉందన్నది దువ్వాడ అనుమానం. ఇప్పుడు ఆ బాధతోనే ధర్మాన బ్రదర్స్ పై నిప్పులు చెరుగుతున్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ పై శాశ్వత బహిష్కరణ వేటు వేయాలని డిమాండ్ అధినేత పై పెరుగుతోంది. అదే జరిగితే దువ్వాడ ప్రయాణం ఎటు అనేది ఒక చర్చ.దువ్వాడ శ్రీనివాస్ తనపై సస్పెన్షన్ వేటుపడినా.. జగన్మోహన్ రెడ్డి విషయంలో గౌరవభావంతోనే ఉన్నారు. ఇప్పటికీ ఆయన విషయంలో గౌరవాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. కానీ శాశ్వత బహిష్కరణ చేస్తే మాత్రం దువ్వాడ శ్రీనివాస్ మరింత స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఉంది. అయితే ఇండిపెండెంట్ గా నిలిచి ధర్మాన కుటుంబాన్ని ఎదుర్కొంటానని చెబుతున్న ఏదో ఒక రాజకీయ పార్టీ ఇప్పుడు ఆయనకు అవసరం. అలాగని టిడిపి తో పాటు జనసేనలో చేరలేరు. ఒకవేళ దువ్వాడ శ్రీనివాస్ చేరుతానన్న అక్కడ చేర్చుకునే పొజిషన్ లేదు. అయితే ఇప్పుడు ఆయనకు కనిపిస్తోంది బిజెపి మాత్రమే. అయితే ఆ పార్టీలో చేరడం కూడా అంత సులువు కాదు. ఎందుకంటే కింజరాపు ఫ్యామిలీ అనుమతి లేనిదే బిజెపిలో కూడా ఎంట్రీ కష్టమే.అయితే జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలంటే దువ్వాడ శ్రీనివాస్ లాంటి నేతను బిజెపిలో చేర్పించాలి. కానీ ఆయన ధర్మాన ఫ్యామిలీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయాల్సి ఉంటుంది. అయితే దువ్వాడ శ్రీనివాస్ జగన్మోహన్ రెడ్డి పట్ల విపరీతమైన అభిమానంతో ఉంటున్నారు. పోనీ తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటుంది అంటే అది కనిపించడం లేదు. ఎందుకంటే జిల్లాలో దువ్వాడ కంటే ధర్మాన ఫ్యామిలీకి బ్యాక్ గ్రౌండ్ ఎక్కువ. పార్టీకి వారు కీలకం కూడా. పైగా దువ్వాడ శ్రీనివాస్ పై వివాదాస్పద ముద్ర ఉంది. వదులుకుంటే దువ్వాడ శ్రీనివాస్ ను వదులుకుంటారు కానీ.. ధర్మాన బ్రదర్స్ ను వదులుకునే ఛాన్స్ లేదు. అయితే బిజెపిలో చేరిక కూడా దువ్వాడకు అంత ఈజీ కాదు.. కానీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టిడిపి తో పాటు జనసేనలో చేరను కానీ.. బిజెపి విషయంలో మాత్రం అలా మాట్లాడడం లేదు. సో ఆయనకు బిజెపి ఆప్షన్ గా ఉంది. కానీ ఆ పార్టీ చేర్పించుకుంటుందా? లేదా అన్నది అనుమానం.

# కొత్త ఏడాది కొత్త వ్యూహాలు

విజయవాడ, జనవరి 1, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కన్నూమిన్నూ కానరాలేదు. కొత్త విధానాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఎవరి సలహాయో తెలియదు కాని సోషల్ ఇంజినీరింగ్ పేరుతో ప్రధానమైన కులాలను తమ వైపునకు తిప్పుకోవాలని జగన్ ప్రయత్నించారు. అందుకే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నామస్మరణలు చేస్తూ మిగిలిన సామాజికవర్గాలను మర్చిపోయారన్నది వైసీపీ నేతలే చేస్తున్న విమర్శ. అందుకే రాష్టరంలోని కొన్ని బలమైన సామాజికవర్గాలు పార్టీకి దూరమయ్యాయని, ఫలితంగానే పదకొండు సీట్లకు పరిమితమయ్యాయని వారు బాహాటంగా చెబుతున్నారు. లబ్దిదారుల ఎంపికతో పాటు నగదు బదిలీకి కూడా ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే జగన్ పార్టీ మొన్నటి ఎన్నికల్లో విఫలమయిందంటున్నారు?వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కుల రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నించేసింది. అన్ని కులాలను దగ్గరకు తీసుకోవాలన్న లక్ష్యంతో ప్రధాన సామాజికవర్గాలకు దూరమయింది. ఎన్నికల్లో అన్ని రకాలుగా పార్టీకి ఉపయోగపడిన వారిని మాత్రం పక్కన పెట్టింది. మరొక వైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నినాదంచేస్తూనే సామాజిక న్యాయం వైపు అడుగులు వేస్తున్నట్లు కనిపించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులు ఇవ్వడం, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అణగారిన వర్గాల్లో ఒక కొత్త ఆశను రేకెత్తించింది. కానీ అసలైన నిర్ణయాధికారం, ఆర్థిక లావాదేవీలు, పార్టీ యంత్రాంగంపై పట్టు మాత్రం రెడ్డి సామాజికవర్గం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటంతో వారు కూడా ఎన్నికల నాటికి దూరమయ్యారుఅటు కాకుండా ఇటు కాకుండా అయినట్లయింది వైసీపీ పరిస్థితి. అందుకే ఎక్కువ మంది వైసీపీ నేతలు ఇప్పుడు వాస్తవంలోకి జగన్ వస్తేనే పార్టీని ప్రజలు ఆదరిస్తారంటున్నారు. బీసీ నినాదం ఎంతగా ఎత్తుకున్నా మొన్నటి ఎన్నికల్లో ఫలితం లేకుండా పోయిందని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

లేకుంటే అదే రకమైన వ్యూహాలతో వెళితే ఈసారి కూడా భంగపాటు తప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఒకవైపు క్యాడర్ లో ఆత్మవిశ్వాసం నింపుతూ మరొకవైపు అన్ని సామాజికవర్గాలను దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేయడంతో పాటు రాజకీయాలను వ్యాపారంగా మార్చవద్దని కూడా చాలా మంది జగన్ కు సూచిస్తున్నారు.

అలా అయితేనే పార్టీకి భవిష్యత్ ఉంటుందని, లేకుంటే ఉండదన్న హెచ్చరికలు బలంగా వినిపిస్తున్నాయి.

# మూడు మున్సిపాలిటీల గ్రేడ్ పెంపు

విజయవాడ, జనవరి 1, ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మూడు మున్సిపాలిటీల గ్రేడ్ పెంచింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ గ్రేడ్‌ను.. స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీని గ్రేడ్ 3 నుంచి గ్రేడ్1కు పెంచింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపాలిటీ హోదాను కూడా గ్రేడ్ 1 నుంచి సెలక్షన్ గ్రేడ్ పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ నిర్ణయాలు తక్షణం అమల్లోకి వస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మూడు మున్సిపాలిటీల గ్రేడ్ పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపాలిటీ హోదాను గ్రేడ్ -1 నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు పెంచారు. 2022 సంవత్సరం నుంచి తణుకు మున్సిపాలిటీకి వచ్చిన ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే స్పెషల్ గ్రేడ్ కింద ఉన్న శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీని సెలక్షన్ గ్రేడ్ కిందకు తెచ్చారు. గడచిన రెండు సంవత్సరాల కాలంలో కదిరి మున్సిపాలిటీకి వచ్చిన ఆదాయ, వ్యయాలను లెక్కలోకి తీసుకుని కదిరి మున్సిపాలిటీ హోదా పెంచారు.తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీ హోదాను కూడా గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 1కి తెచ్చారు. 2021 నుంచి వచ్చిన లెక్కలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు హోదా పెంపుపై నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. మరోవైపు మున్సిపాలిటీల గ్రేడ్లు పెంచడం వలన పట్టణం అభివృద్ధికి మరిన్ని నిధులతో పాటుగా అధికారాలు కూడా లభిస్తాయి.మున్సిపాలిటీల హోదా పెరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లతో పాటుగా.. ఆర్థిక సంఘం నిధులు కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. అలాగే మున్సిపాలిటీ స్థాయి అనుసరించి.. కమిషనర్ హోదాతో పాటుగా సిబ్బంది సంఖ్య పెరిగి పరిపాలన వేగంగా జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి.మున్సిపాలిటీలకు అధిక నిధుల కేటాయింపుతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు. తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఎక్కువ నిధులు కేటాయించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే పార్కులు, వైకుంఠధామాలు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు కోసం కూడా ప్రత్యేకంగా నిధులు అందుతాయని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల జనాభా, ఆదాయ, వ్యయాలను పరిగణలోకి తీసుకుని ఏపీ ప్రభుత్వం తణుకు, కదిరి, కొవ్వూరు మున్సిపాలిటీ హోదాను పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.

## వణికిస్తున్న ప్రళయ్...

న్యూఢిల్లీ, జనవరి 1, (న్యూస్ పల్స్) భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఒడిశా తీరంలో మరో అద్భుతమైన విజయాన్ని సాధించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ప్రళయ్ క్షిపణులను ఒకే లాంచర్ ద్వారా వెంటవెంటనే విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి జరిగిన ఈ సాల్వో ప్రయోగంలో రెండు క్షిపణులు అతి తక్కువ సమయంలో ఒకదాని తర్వాత ఒకటి దూసుకెళ్లాయి. యూజర్ ఎవాల్యూయేషన్ ట్రయల్స్‌లో భాగంగా నిర్వహించిన ఈ పరీక్షలో రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాయి.ఒకే లాంచర్ నుంచి ఇలా వెంటవెంటనే క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం యుద్ధ సమయంలో శత్రువుల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేయడానికి ఎంతో కీలకం కానున్నాయి. ఈ విజయంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత సైన్యం, వైమానిక దళం యుద్ధ సామర్థ్యాన్ని మరో స్థాయికి తీసుకెళ్తుందని కొనియాడారు.

ప్రళయ్ క్షిపణి ప్రత్యేకతలు

ఈ ప్రళయ్ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే పాక్షిక బాలిస్టిక్ క్షిపణి.

150 కిలోమీటర్ల నుంచి 500 కిలోమీటర్ల దూరంలోని శత్రువుల లక్ష్యాలను ఇది సులువుగా ధ్వంసం చేయగలదు.

గంటకు సుమారు 7400 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. ఇది శత్రువుల రాడార్లకు చిక్కడం దాదాపు అసాధ్యం.

గాలిలో తన ప్రయాణ మార్గాన్ని మార్చుకోగలిగే సామర్థ్యం ఉండటం వల్ల దీన్ని ఇంటర్‌సెప్టర్ క్షిపణులతో అడ్డుకోవడం కష్టం.

# రేణుకా కధ చాలా ఉంది

విశాఖపట్టణం, జనవరి 1, అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులు ఇటీవల ఓ గంజాయి ముఠాను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రేణుక కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో రేణుక ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైలులో ఉంది. అయితే రేణుకకు సంబంధించి అనేక సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రేణుక సాఫ్ట్‌వేర్ జాబ్ చేసినట్లు చెప్తున్నా.. ఆమె వ్యవహార శైలి నేపథ్యంలో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటు ఊరిజనం కూడా రేణుక బీటెక్ ఎక్కడ చదివిందో తెలియదని చెప్తున్నారు.అనకాపల్లి జిల్లాలో పోలీసులకు చిక్కిన గంజాయి స్మగ్లర్ రేణుక విషయంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన రేణుక.. చిన్న వయసులోనే పక్కదారి పట్టినట్లు తెలిసింది. చిన్నప్పుడే నేరాలకు అలవాటు పడి.. గంజాయి స్మగ్లర్‌గా మారినట్లు తెలిసింది. సంతకవిటి మండలానికి చెందిన రేణుక 17 ఏళ్ల వయసులోనే చోరీలకు పాల్పడినట్లు ఆమె ఊరిజనం చెప్తున్నారు. అది బయటపెట్టారనే కోపంతో ఓ హత్య కూడా చేసినట్లు వెల్లడించారు. చిన్న వయసులో ఉన్నప్పుడు.. గ్రామంలోని ఓ ఇంట్లోకి చొరబడి బంగారం కాజేసిందట. బంగారు నగలను ఇంట్లో పెట్టి పొలానికి వెళ్లిన ఓ మహిళ ఇంట్లోకి దొంగగా ప్రవేశించిన రేణుక.. ఆ నగలను కాజేసినట్లు ఊరిజనం చెప్తున్నారు.రేణుక ఇంట్లోకి వెళ్లిన విషయాన్ని గమనించిన ఎదురింటావిడ.. చోరీ జరిగిన ఇంటి మహిళకు ఈ సంగతి తెలియజేసింది. దీంతో ఎదురింటావిడ మీద కోపం పెంచుకున్న రేణుక.. ఆమెకు ఉన్న ఒక్కగానొక్క కొడుకును గొంతు నులిమి చంపేసి.. మేడపై పడేసినట్లు గ్రామస్థులు చెప్తున్నారు. ఈ విషయంపై బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఈ కేసులో తాత్కాలికంగా ఊరట లభించటంతో.. రాజమండ్రిలో ఉంటున్న సోదరుడి ఇంటికి వలస వెళ్లినట్లు వివరించారు.అనంతరం రాజమండ్రి నుంచి బెంగళూరుకు రేణుక మకాం మార్చింది. బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు ఊరిజనానికి చెప్తూ వచ్చింది. అయితే బీటెక్ చదివి సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నానని చెప్పే రేణుక.. బీటెక్ ఎక్కడ చదివిందో తమకు తెలియదని ఊరిజనం చెప్తూ ఉండటం గమనార్హం. ఊర్లో ఉన్న తల్లిదండ్రులను చూసేందుకు కూడా గత పదేళ్ల నుంచి రాలేదని చెప్తున్నారు.

ఓసారి సాలూరులో గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కినట్లు సమాచారం ఉందని చెప్తున్నారు.మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి.. ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించే ముఠాలో రేణుక కొన్ని రోజులు పనిచేసినట్లు తెలిసింది. ఆ తర్వాత మరికొందరితో గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని.. గంజాయిని ఏజెన్సీ ప్రాంతాల నుంచి చెన్నైకు చేర్చేవారని.. అక్కడి నుంచి సముద్ర మార్గంలో శ్రీలంక స్మగ్లర్లకు అమ్మేవారని తెలిసింది. మరోవైపు బీటెక్ చదివి ఐటీ జాబ్ చేశానని.. ఆ తర్వాత జాబ్ వదిలేసి గంజాయి దందాలోకి వచ్చినట్లు పోలీసుల వద్ద రేణుక చెప్పినట్లు సమాచారం. అయితే ఆమె వ్యవహార శైలిపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తు?న్నారు.

# ఏపీని భయపెడుతున్న స్క్రబ్ టైఫస్..

## 2 వేలకు పైగా పాజిటివ్ కేసులు..

కాకినాడ, జనవరి 1, ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ వ్యాధి కలకలం రేపుతోంది. ఇప్పటికే 22 మంది మరణించగా.. గడిచిన రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. చిత్తూరు జిల్లాలో అత్యధిక కేసులు నమోదవుతుండగా.. తర్వాత స్థానాల్లో తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఇక్కడ కూడా స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి. అపరిశుభ్రత, అవగాహన లోపమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. సకాలంలో గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదని వైద్యులు సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్క్రబ్ టైఫస్ వ్యాధి వణికిస్తోంది. రోజురోజుకు రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు, మరణాలు గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే ఏపీలో స్క్రబ్ టైఫస్ కేసులు గత రెండు సంవత్సరాల నుంచే నమోదవుతున్నా... అధికారికంగా మరణాలు సంభవించినట్లు వివరాలు లేవు. కానీ ఈ సంవత్సరం మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు ఏపీలో స్క్రబ్ టైఫస్ బారిన పడి 22 మంది మరణించారు. గత రెండేళ్ల నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 2 వేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదు కాగా... అత్యధికంగా చిత్తూరు జిల్లాలో ఎక్కువ కేసులు నమోదయ్యాయి. రెండేళ్ల నుంచి ఏపీలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు అవుతున్నాయి. 2023లో 548, 2024 సంవత్సరంలో 514 కేసులు నమోదు కాగా... ఈ సంవత్సరం ఇప్పటి వరకు 491 కేసులు నమోదయ్యాయి. మరో వైపు తిరుపతి జిల్లాలోనూ కేసులు పెరుగుతున్నాయి. కాకినాడ, విశాఖపట్నం జిల్లాలు కూడా ఆందోళనకర సంఖ్యలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి.పరిసరాల అపరిశుభ్రత, అవగాహన లేమి స్క్రబ్ టైఫస్ వ్యాప్తికి ప్రధాన కారణాలు అంటున్నారు. అయితే స్క్రబ్ టైఫస్ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే పెద్దగా సమస్య ఉండదని వైద్యులు చెబుతున్నారు. కానీ చాలామంది జ్వరానికి వాడే సాధారణ మందులు వాడి, పరిస్థితి తీవ్రమయ్యాకే ఆసుపత్రులకు వెళు_న్నారని తెలిపారు. అందువల్లే ప్రాణాపాయం ఏర్పడుతోంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.అపరిశుభ్ర పరిసరాలు, వ్యవసాయ ప్రాంతాలు, తేమ ఎక్కువగా ఉండే పొదల్లో తేవీటి పురుగు (చిగ్గర్ మైట్) ఎక్కువగా తిరుగుతుంది. దీని కాటు వల్లే స్క్రబ్ టైఫస్ వస్తుంది. ఈ పురుగు కొత్తది కాదని, ఏళ్లుగా ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే గత కొన్నాళ్లుగా ఈ పురుగు ఎందుకు ప్రమాదకరంగా మారిందనేది నిపుణులకు ఇంకా అంతుచిక్కడం లేదు.

దేశవ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నా... ఆంధ్రప్రదేశ్‌లోనే మరణాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.స్క్రబ్ టైఫస్ కేసులు మరింత పెరుగుతుండటంతో... దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయడానికి, బ్యాక్టీరియాలోని రకాలను గుర్తించడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఒక అంటువ్యాధి ప్రజారోగ్యానికి సవాలుగా మారుతున్న నేపథ్యంలో... వైద్య రంగ నిపుణులను సలహాదారులుగా నియమించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా, అంటువ్యాధుల నివారణకు జాతీయ వైద్య సంస్థలు, కీలక రంగాల నిపుణులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ వ్యాధి నియంత్రణకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది.

# ఏపీపై కాంగ్రెస్ ఫోకస్

విజయవాడ,జనవరి 1 ఏపీపై కాంగ్రెస్ హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది. వచ్చే ఎన్నికల నాటికి బలంగా ఉనికి చాటాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే ఏపీ అసెంబ్లీతో పాటే సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఆ సమయానికి పార్టీ బలం పుంజుకునేలా చేయాలన్నది అధినాయకత్వం ఆలోచన. ముఖ్యంగా ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ చూస్తున్నారు. ఆమె నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనించి మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా షర్మిలను తొలగించి కొత్త నాయకత్వాన్ని తెరపైకి తెస్తారని తెలుస్తోంది. ప్రముఖంగా ఓ కాపు నేత పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వానికి ఏపీ నుంచి అధిక మద్దతు ఉంది. ఇక్కడ ప్రభావం చూపిస్తే ఎన్డీఏ కు ధీటుగా కాంగ్రెస్ పార్టీని నిలపవచ్చన్నది అధినాయకత్వం ఆలోచన.2024 ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు అప్పగించారు. కానీ ఆమె వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. పైగా ఏపీలో ఎన్డీఏ కూటమి ఉంది. దానికి ధీటుగా వెళ్లాల్సిన షర్మిల జగన్మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకున్నారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీని జగన్ దెబ్బతీసి ఉన్నందున కాంగ్రెస్ హై కమాండ్ కూడా షర్మిలను ప్రోత్సహించింది. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డిని షర్మిల టార్గెట్ చేయడం కాంగ్రెస్ హై కమాండ్ కు నచ్చలేదు. అందుకే ఆమె స్థానంలో కొత్త నేతను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. అది కూడా భవిష్యత్తు ఆలోచనతోనే ఆ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. షర్మిల ఉంటే జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైపు చూడరు. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్ పార్టీ వైపు చూసేలా కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు సమాచారం.కాంగ్రెస్ పార్టీకి అధినాయకులుగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. అందుకే జాతీయస్థాయిలో బలోపేతం చేయాలంటే ఈ ముగ్గురు నేతలు తలో రాష్ట్రాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాలి. అందులో భాగంగానే ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ తీసుకున్నట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి వివిధ కారణాలతో బయటకు వెళ్లిపోయిన వారికి నేరుగా ఆమె ఫోన్లు చేస్తున్నారు. అయితే బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన యువనాయకత్వానికి రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వంగవీటి మోహన్ రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణకు బాధ్యతలు కట్టబెడితే బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఓ మాజీ ఎంపీ మధ్యవర్తిత్వంతో వంగవీటి రాధాకృష్ణతో చర్చలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఆయన సానుకూలంగా స్పందిస్తే కాంగ్రెస్ పార్టీలో చేర్పించి అధ్యక్ష బాధ్యతలు ఇస్తారని సమాచారం. మరి ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలు హైదరాబాద్‌లో విషాదంగా మారాయి. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానీనగర్‌లో న్యూ ఇయర్ సందర్భంగా గత రాత్రి 17 మంది కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి, బిర్యానీ తిన్న అనంతరం వారు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు.వారిలో పాండు (53) పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మరో 15 మంది అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని తక్షణమే నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మద్యం లేదా ఆహారంలో కలుషితం కారణమా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

# నాల్కో ప్రకటనతో గిరిజనుల ఆందోళన

విజయనగరం,జనవరి 1 ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులోని కొటియా వివాదస్పద గ్రామాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొటియా ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలు ప్రారంభిస్తామంటూ నాల్కో కంపెనీ చేసిన ప్రకటనతో అక్కడి గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివాదాల్లో ఉన్న కొటియా భూభాగం ఏ రాష్ట్రానికి చెందిందో క్లారిటీ లేకుండా ఒరిస్సా అనుమతులు ఇవ్వడంపై కొటియావాసులు ఆందోళనకు దిగుతున్నారు. కొటియా ప్రాంతంలో ఎలాంటి కార్యకలాపాలు జరపకూడదని సుప్రీంకోర్టు స్టేటస్-కో ఉన్నప్పటికీ బాక్సైట్ తవ్వకాలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా, ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతం అత్యంత విలువైన ప్రాంతం. ఈ ప్రాంతంలోని 22 గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందుతాయన్నది దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం. ఈ భూభాగం తమదంటే తమదంటూ ఇరు రాష్ట్రాలు కోర్టు మెట్లక్కాయి. దీంతో భూభాగం ఏ రాష్ట్రానికి చెందిందో పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని అప్పటి వరకు ఈ ప్రాంతంలో ఇరు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం కూడా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకూడదని 1968 డిసెంబర్ 2న సుప్రీంకోర్టు స్టేటస్-కో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి యథాతథ స్థితి కొనసాగాల్సి ఉంది. అలా ఈ ప్రాంతవాసులకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ఇవ్వొచ్చు కానీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం మాత్రం కుదరదు.అలా ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఏపి ప్రభుత్వం అమలుచేస్తుంది.. కానీ ఒరిస్సా ప్రభుత్వం మాత్రం కోర్టు తీర్పుకు విరుద్ధంగా.. కొటియాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తూ తమ అధీనంలోకి తీసుకునేలా దూకుడుగా ముందుకు వెళ్తుంది. ఇక్కడ ఉన్న 22 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వ భవనాలు, రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పిస్తూ ముందుకు వెళ్తుంది. అలాగే ఏపీ అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ఈ ప్రాంతంలో ఏమైనా ప్రభుత్వ పథకాల కోసం వెళ్తే వారిని కొటియా గ్రామాల నుండి బలవంతంగా వెనక్కి పంపిస్తుంది. పలువురుపై కేసులు కూడా పెడుతుంది. ఈ క్రమంలోనే కొటియావాసులు సైతం తాము ఏపీతో ఉంటామని ఒడిశాలో ఉండమని ఆందోళనలు చేపడితే.. అలా ఆందోళనకు దిగిన వారిపై సైతం కేసులు పెడుతుంది ఒడిశా ప్రభుత్వం. అలా ఎప్పటికప్పుడు కొటియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు తాజాగా బాక్సైట్ గనుల అంశం మళ్లీ కొటియాలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తుంది. 2026 కొత్త సంవత్సరంలో కొటియా సమీపంలోని పొట్టంగి ప్రాంతంలో సుమారు 660 హెక్టార్లు, అంటే దాదాపు 1750 ఎకరాల్లో నాల్కో సంస్థకు బాక్సైట్ తవ్వకాలు ప్రారంభించేందుకు ఒడిశా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో కొటియా ప్రాంత గిరిజనుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. కొటియా పరిధిలో నివసిస్తున్న గిరిజనుల్లో ఒక్కసారిగా భయం నెలకొంది. బాక్సైట్ తవ్వకాలు జరిగితే తమ గ్రామాల పరిస్థితి ఏంటి? పోడు వ్యవసాయం చేసుకొని బ్రతుకుతున్న తమ భూములు పరిస్థితి ఏంటి? తమ అటవీ హక్కులు, జీవనాధారం ఏమవుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు ఎలా చేస్తారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు ఒడిశా ప్రభుత్వం ఎలా అనుమతిస్తుంది అని నిలదీస్తున్నారు.తవ్వకాలు చేస్తే మేం ఎక్కడికి వెళ్లాలి? ప్రభుత్వం మాకు ముందుగా చెప్పాలి కదా అని నిలదీస్తున్నారు. ఇదిలా ఉండగా, నాల్కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ వచ్చే జూన్ నాటికి బాక్సైట్ తవ్వకాలను ప్రారంభించాలన్న లక్ష్యంతో ఉన్నామని వెల్లడించారు. ఒడిశాలోని పొట్టంగి ప్రాంతంలో బాక్సైట్ గనుల అభివృద్ధి ద్వారా అల్యూమినియం వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. గనుల అభివృద్ధి బాధ్యతలను దిలీప్ బిల్డ్‌కాన్ సంస్థకు కూడా అప్పగించినట్లు చెప్పారు. కోరాపుట్ జిల్లా దామనోడి అల్యూమినా రిఫైనరీ సామర్థ్యాన్ని ప్రస్తుత 22.75 లక్షల టన్నుల నుంచి మరో 10 లక్షల టన్నులకు పెంచాలని నాల్కో లక్ష్యంగా పెట్టుకుంది. ముడి పదార్థాల కోసం ఒడిశా ప్రభుత్వం నుంచి సుమారు 697 హెక్టార్ల భూమిని 50 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నట్లు వెల్లడించారు. అలా నాల్కో చైర్మన్ ఇచ్చిన స్టేట్మెంట్ తో గిరిజనులు ఆందోళనలో పడ్డారు. సుప్రీంకోర్టు స్టేటస్‌కో ఉన్న కొటియా పరిధిలో ఈ తవ్వకాలు చట్టబద్ధమేనా? 22 గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడనుంది? అటవీ హక్కుల చట్టం, గ్రామసభ అనుమతులు తీసుకున్నారా? లేదా? అవేమీ లేకుండా నాల్కో సంస్థకు ఎలా అనుమతులు ఇచ్చింది? నాల్కో సంస్థ ఎలా త్రవ్వకాల పై ప్రకటిస్తుంది? అన్న అనేక అంశాల పై ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. అయితే మరోసారి దూకుడుగా వెళ్తున్న ఒడిశా ప్రభుత్వ వ్యవహారం పై ఏపి ప్రభుత్వం స్పందించాలని అంటున్నారు ఏపి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర. ఏపికి చెందిన భూములను ఒడిశా ఎలా అనుమతులు ఇస్తుంది? సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ ఒడిశా ఎలా ఏకపక్షంగా వ్యవహరించి నాల్కో సంస్థకు బాక్సైట్ తవ్వకాలకు అనుమతి ఇస్తారు అని మండిపడుతున్నారు.

# పెద్దిరెడ్డికి చెక్ పెట్టేందుకేనా...

తిరుపతి, జనవరి 1, సీఎం చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా..అందులో ఏదో ఒక పొలిటికల్ కోణం ఉంటుంది. ఇది కామన్. చంద్రబాబు పనితీరు మీద అవగాహన వాళ్లు ఎవరైనా చెప్పే మాట ఇదే. ఇప్పుడు జిల్లా పునర్విభజన విషయంలో కూడా చంద్రబాబు వ్యూహాత్మక డెసిషన్ తీసుకున్నారన్న టాక్ వినిపిస్తోందిగత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దడంతో పాటు..ప్రజలకు పాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన చేశారు. అయితే పాత జిల్లాల్లో అన్నమయ్య జిల్లా పేరు ఉన్నప్పటికీ.. ఆ జిల్లా మ్యాపే మారిపోయింది. అన్నమయ్య జిల్లాల్లోని ఒక్కో నియోజకవర్గాన్ని ఒక్కో జిల్లాల్లో కలిపేసింది కూటమి సర్కార్.అయితే ఒక్క రాయచోటి ప్రజల కోసమే జిల్లా చేయలేమని.. సాంకేతిక అంశాలు ఎన్నో ముడిపడి ఉంటాయని సీఎం చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. కానీ అన్నమయ్య జిల్లా విభజన వెనక పెద్ద స్కెచ్చే ఉందన్న టాక్ బయలుదేరింది. రాజకీయంగా రాజంపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బలంగా నాటుకుపోయిన పెద్దిరెడ్డి ఫ్యామిలీ ప్రభావాన్ని తగ్గించాలన్నదే చంద్రబాబు వ్యూహమంటూ చర్చ జరుగుతోంది.అన్నమయ్య జిల్లా విషయంలో అటు ప్రజల కోరిక నేరవేరుస్తూ..ఇటు తన పొలిటికల్ స్కెచ్ వర్కౌట్ అయ్యేలా బాబు డెసిషన్ తీసుకున్నారన్న ప్రచారం మొదలైంది. అటు స్వామికార్యం..ఇటు స్వకార్యం రెండూ నెరవేరినట్లు అయిందన్న టాక్ కూడా నడుస్తోంది.వైసీపీ హయాంలో కుప్పంలో చంద్రబాబుకు గడ్డు పరిస్థితులను క్రియేట్ చేశారు. 2024లో అధికారంలో వచ్చాక చంద్రబాబు కూడా తిరిగి ఇచ్చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. కుంభకోణాల ఉచ్చులో ఇరుక్కుపోయిన పెద్దిరెడ్డి ఫ్యామిలీని..రాజకీయంగా కూడా దెబ్బతీసేలా పావులు కదుపుతున్నారని అంటున్నారు. పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరు జిల్లా పరిధి నుంచి అన్నమయ్య జిల్లా పరిధిలో మార్చించారు.దీంతో రాజంపేట లోక్‌సభ నియోజకవర్గంలో పెద్దిరెడ్డి ప్రభావాన్ని తగ్గించే ప్లాన్ ఉందంటున్నారు. ఇక నకిలీ మద్యం కేసులో పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లె ఉండటం మరో అస్త్రం దొరికినట్లు అయిందంటున్నారు. అటు భూ కుంభకోణం, ఇటు లిక్కర్ స్కామ్ ఆరోపణల్లో చిక్కుకున్న పెద్దిరెడ్డి కుటుంబం..ఇటు రాజకీయంగా కూడా ఇబ్బందుల పాలయ్యే పరిస్థితిని క్రియేట్ చేస్తున్నారటఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధులున్న అన్నమయ్య జిల్లాను మూడు నియోజకవర్గాలకు పరిమితం చేశారు. ఆ మూడు నియోజకవర్గాల్లో రాజంపేటను వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోకి తెచ్చారు.

కోడూరును తిరుపతి జిల్లాలో మెర్జ్ చేశారు. రాయచోటిని కొత్తగా ఏర్పడే మదనపల్లి జిల్లాలో కలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడంతో..రాయచోటి జిల్లా కేంద్రాన్ని కోల్పోయింది. ఇటు చిత్తూరు జిల్లాకు పుంగనూరు దూరం కావడంతో చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి ప్రభావం తగ్గుతుందనేది టీడీపీ అంచనా అంటున్నారు.అన్నమయ్య జిల్లాకు చెందిన రాజంపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మూడు కీలక అసెంబ్లీ నియోజకవర్గాలు మూడు జిల్లాల పరిధుల్లోకి వెళ్లిపోయాయి. దీంతో ఆ మూడు సెగ్మెంట్లపై కూడా పెద్దిరెడ్డి ఫ్యామిలీ పట్టు కోల్పోవడం ఖాయమని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారట. ఇలా పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయ ఆధిక్యతను దెబ్బతీసే స్కెచ్ వేశారన్న టాక్ వినిపిస్తోంది.

# అప్పు కోటి 75 లక్షలు...
# వడ్డీతో కలిసి 147 కోట్లు

సింగపూర్, జనవరి 1, (న్యూస్ పల్స్) అప్పులు తీసుకుంటే సకాలంలో చెల్లించాలి. లేకపోతే వడ్డీలు, వాటి మీద చక్రవడ్డీలు, ఫైన్లు ఇలా తడిసిమోపెడు అవుతూ ఉంటాయి. అప్పు తీర్చలేని పరిస్థితి ఉంటే.. అసలు రుణాలు తీసుకోకపోవడమే బెటర్ అంటూ ఎంతో మంది ఆర్థిక నిపుణులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ చాలా మంది అదే ఊబిలోకి చిక్కుకుపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇలా ఎంతో మంది అప్పులు తీసుకుని.. వాటిని కట్టలేక తిప్పలు పడుతూ ఉన్న ఆస్తులు అమ్ముకుని రోడ్డున పడ్డవారు ఎంతో మంది ఉన్నారు. తాజాగా సింగపూర్‌కు చెందిన ఒక వ్యక్తి రూ.1.75 కోట్ల అప్పు తీసుకుంటే.. వడ్డీ, పెనాల్టీల కారణంగా అది ఏకంగా రూ.147 కోట్లకు చేరిన విస్తుపోయే ఉదంతం వెలుగులోకి వచ్చింది.ఈ వ్యవహారాన్ని పరిశీలించిన సింగపూర్ హైకోర్టు జడ్జి ఫిలిప్ జేయరత్నం.. తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఈ ఘటన మనస్సాక్షిని కలిచివేసేది అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగపూర్‌లోని ఒక లైసెన్స్ పొందిన వడ్డీ వ్యాపారి వద్ద ఆ వ్యక్తి.. అప్పు తీసుకోగా.. అది అతడి జీవితాన్నే తలకిందులు చేసింది. 2010లో ఆ వ్యక్తి తన అవసరాల కోసం సుమారు రూ.1.75 కోట్ల అప్పు తీసుకున్నాడు. అందుకు నెలకు 4 శాతం (ఏడాదికి 48 శాతం) చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నాడు.వాయిదా చెల్లించడం ఆలస్యమైతే నెలకు 8 శాతం అదనపు వడ్డీ, ఆలస్యంగా చెల్లిస్తే.. ప్రతీ నెలా రూ.1.75 లక్షలు ఫైన్‌గా నిర్ణయించారు. దీంతో అది కేవలం 4 ఏళ్లలోనే అంటే 2014 నాటికి ఆ అప్పు రూ.21 కోట్లకు చేరింది. 2021 నాటికి అది ఏకంగా రూ.147 కోట్లకు ఎగబాకింది. అతడు తీసుకున్న అప్పు కొండలా పేరుకుపోయి అప్పు తీర్చలేకపోయిన తరుణంలో తన సొంత ఇంటిని ఆ వడ్డీ వ్యాపారికి విక్రయించాల్సి వచ్చింది. ఆ ఇంటిని రూ.14 కోట్లకుఆ వడ్డీ వ్యాపారి సంస్థ డైరెక్టరుకే అమ్మేసినప్పటికీ అతని అప్పు తీరలేదు. ప్రస్తుతం అతను అదే ఇంట్లో తన కుటుంబంతో కలిసి నెలకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల అద్దె చెల్లిస్తున్నాడు.అద్దె చెల్లించలేదనే కారణంతో డైరెక్టర్ కోర్టుకు వెళ్లగా.. ఆ అప్పు పెరిగిన తీరు చూసి సింగపూర్ హైకోర్టు జడ్జి ఆశ్చర్యపోయారు. అంత తక్కువ అప్పు అంత భారీ స్థాయికి ఎలా చేరిందనే దానిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోర్టు ఆదేశించింది. వడ్డీ వ్యాపారి కావాలనే మోసం చేశాడా లేదా చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించారా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. రూ.1.75 కోట్ల అప్పు కోట్లలోకి చేరడం అన్యాయమని.. ఇది సమాజ నియమాలకు విరుద్ధమని జడ్జి పేర్కొన్నారు.

సింగపూర్‌లో 2015 అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం లైసెన్స్ పొందిన వడ్డీ వ్యాపారులు నెలకు 4 శాతానికి మించి వడ్డీ వసూలు చేయకూడదు. లేట్ పేమెంట్ ఫీజు నెలకు రూ.4200కు మించకూడదు. కానీ ఈ వ్యక్తి అప్పు 2010లో తీసుకోవడం వల్ల పాత నిబంధనల లొసుగులను వడ్డీ వ్యాపారి అనుకూలంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది.

# పాకిస్తాన్ కు వ్యతిరేకంగా
# భారత్ బిగ్ స్కెచ్

న్యూఢిల్లీ, జనవరి 1, (న్యూస్ పల్స్) భారత్?ఒమాన్ మధ్య వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు చరిత్రలో లోతుగా పాతుకుపోయాయి. చత్రపతి శివాజీ నుంచి గ్రాండ్ ముఫ్తీ వరకు సత్సంబంధాలు, మస్కట్‌లో భారతీయ వ్యాపారుల స్థిరపడడం ఈ బంధాల చిహ్నాలు. ఇటీవల డిసెంబర్ 29న ప్రారంభమైన కౌండిన్య షిప్ యాత్ర ప్రాచీన నావికా మార్గాలను పునరుద్ధరించి ఈ వారసత్వాన్ని గుర్తు చేసింది.ఇదిలా ఉంటే ప్రధాని మోదీ ఇటీవల ఒమాన్‌లో పర్యటించారు. భారత ఎగుమతులపై సుంకాలు లేకుండా ఒప్పందం చేసుకున్నారు. ఇంధన రంగం, పర్యాటకం, ప్రబల సాంకేతికతలపై 4 బిలియన్ డాలర్ల ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాలు రెండు దేశాల మధ్య వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తూ భారత ఆర్థిక ప్రభావాన్ని పెంచుతాయి.ఒమాన్ సుల్తాన్ అనుమతితో దుకం ఎయిర్‌బేస్, డకం పోర్టులో భారత నౌకాదళానికి ప్రవేశం లభించింది. హిందూ మహాసముద్రంలోకి ఆఫ్ ఆర్మోజ్ జలసంధి సమీపంలో ఉన్న ఈ స్థావరం యుద్ధనౌకల రిపేర్లు, ఇంధన పునరునామి అవకాశాలను అందిస్తుంది. పడవల రాకపోకలపై నిఘా పెట్టే సామర్థ్యం భారత్‌కు కీలక ప్రయోజనం.చిబూటీలోని భారత స్థావరంతోపాటు దుకం ఆధారం చైనా, అమెరికా నౌకలపై పరిశీలన అవకాశాన్ని కల్పిస్తుంది. పాకిస్తాన్ గ్వాదర్ పోర్టు, ఇరాన్ చాబహార్ పోర్టులకు సమీపంలో ఉండటం వల్ల అచేబియా జలాల్లో శత్రు కదలికలు గమనించవచ్చు. దుకం?చాబహార్ సమీకరణం ప్రాంతీయ ఆధిపత్యానికి బలమైన స్థాపన.ఒమాన్‌తో భారత్ సైనిక వ్యాసాలు ఏటా జరుగుతాయి. 'నసీముల్ బహార్' పేరిట నౌకా దళాలు, ఈస్టర్న్ బ్రిడ్జి వద్ద వాయుసేనలు, భూసైన్యాల మధ్య శిక్షణలు ప్రాంతీయ భద్రతకు బలం చేకూరుస్తాయి.

రస్సెల్ హగ్‌లోని సిగ్నలింగ్ పోస్ట్ ఆఫ్ ఆర్మోజ్ ద్వారా 30% ప్రపంచ ఆయిల్ రవాణాపై నియంత్రణ పొందవచ్చు.పాక్‌కు దుకం ఒప్పందం తీవ్ర దెబ్బ. అరబియా సముద్రంలో భారత పటిష్ఠం పెరగడం వల్ల గ్వాదర్ ప్రభావం తగ్గుతుంది. ఒమాన్‌తో భారత్‌కు ఉన్న చారిత్రక విశ్వాసం ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త సమతుల్యతను తీసుకొస్తుంది.

# రోజుల్లో 3 పార్టీలు...
# చివరకు పవార్ పార్టీ టికెట్

ముంబై, జనవరి 1, (న్యూస్ పల్స్) మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర రాజకీయాల్లో చిత్ర విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల కోసం బీజేపీకి షాకిస్తూ శరద్ పవార్, అజిత్ పవార్ ఒక్కటి కావడం.. దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తికరంగా మారింది. మరోవైపు.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడమే లక్ష్యంగా ఓ నాయకుడు ఏకంగా 3 పార్టీలు మారారు. అయితే అది కూడా కేవలం ఎనిమిది రోజుల వ్యవధిలోనే కావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. థానే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఈ ఆసక్తికర ఉదంతం వెలుగులోకి వచ్చింది.నేరచరిత్ర కలిగిన మయూర్ షిండే అనే వ్యక్తి.. కేవలం 8 రోజుల వ్యవధిలోనే 3 రాజకీయ పార్టీల జెండాలు మార్చేశారు. డిసెంబర్ 22వ తేదీ వరకు ఏకనాథ్ షిండే నేతృత్వంలోని షిండే శివసేన పార్టీలో ఉండేవారు. అయితే థానే మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో.. డిసెంబర్ 23వ తేదీన బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర చవాన్ సమక్షంలో కమలం పార్టీలో చేరారు.సావర్కర్ నగర్ (వార్డు నంబర్ 14) నుంచి బీజేపీ తరఫున తనకు టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ భంగపాటే ఎదురైంది. బీజేపీలో మయూర్ షిండేకు నిరాశ ఎదురవడంతో.. నామినేషన్ల చివరి రోజైన డిసెంబర్ 30వ తేదీన హుటాహుటిన అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎట్టకేలకు ఎన్సీపీ తరఫున ఆయనకు అభ్యర్థిత్వం ఖరారైంది.

అయితే మయూర్ షిండేపై అనేక తీవ్రమైన నేరాలు ఉండటం గమనార్హం. హత్య, హత్యాయత్నం, దోపిడీ వంటి అనేక కేసులు ఉండటంతోపాటు.. గతంలో మకోకా (ఎంసీఓసీఏ) చట్టం కింద కూడా విచారణను ఎదుర్కొన్నారు. గతంలో ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన కీలక నేత సంజయ్ రౌత్‌ను బెదిరించిన కేసులో మయూర్ షిండే అరెస్ట్ కూడా అయ్యారు. కాగా.. థానే మున్సిపల్ కార్పొరేషన్‌లోని 131 స్థానాలకు జనవరి 15వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 40 స్థానాల్లో.. షిండే శివసేన 87 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్, అజిత్ పవార్ ఎన్సీపీ స్వతంత్రంగానే బరిలోకి దిగుతున్నాయి.

# డాన్ ఇంట నగదు... వజ్రాలే... వజ్రాలు

ఛండీఘడ్, జనవరి 1, (న్యూస్ పల్స్) ఢిల్లీ-ఎన్సీఆర్‌లో అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ యాదవ్, అతని అనుచరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని నగదు 5 కోట్ల రూపాయలకు పైగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పాటు సుమారు 8 కోట్ల రూపాయల విలువైన బంగారం, వజ్రాల నగలున్న సూట్‌కేస్, 35 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలు దొరికాయి. మొత్తం కలిపి సుమారు 48 కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సోదాలు మంగళవారం మొదలై బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. అక్రమంగా సంపాదించిన డబ్బును లెక్కించడానికి బ్యాంక్ అధికారులను, కరెన్సీ నోట్లను లెక్కించే యంత్రాన్ని కూడా పిలిపించారు. రాజకీయ అండతో ఇందర్జీత్ సింగ్ యాదవ్ బెదిరించి డబ్బులు వసూలు చేశాడని, ఈ డబ్బుతోనే అక్రమాలకు పాల్పడ్డాడని అధికారులు తెలిపారు. యాదవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతను యూఏఈకి పారిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు.హరియాణాకు చెందిన ఇందర్జీత్ సింగ్ యాదవ్ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. అతడు యూఏఈ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండేవాడు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 30న దిల్లీలోని సర్వప్రియా విహార్‌లో ఉన్న ఇందర్‌జిత్ సన్నిహితుడి నివాసంలో ఈడీ సోదాలు మొదలుపెట్టింది. భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు గుర్తించింది."ఇందర్జీత్ సింగ్ యాదవ్ అక్రమంగా బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుండి బలవంతంగా డబ్బులు తీసుకోవడం, ఆయుధాలతో బెదిరించడం, ఇలాంటి అక్రమ కార్యకలాపాల ద్వారా డబ్బు సంపాదించడం వంటి వాటిపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేశాం" అని ఈ కేసు విచారణలో ఉన్న ఒక సీనియర్ అధికారి చెప్పారు.యాదవ్, అతని అనుచరులపై హర్యానా, యూపీ రాష్ట్రాల్లో 15కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆయుధాల చట్టం, ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి, ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశారు. ఈడీ దాడుల్లో బయటపడిన ఆస్తుల విలువ చాలా ఎక్కువగా ఉండటంతో, ఈ కేసు మరింత తీవ్రంగా మారింది. యాదవ్ అక్రమ సంపాదన వెనుక ఉన్న పెద్ద నెట్‌వర్క్‌ను ఈడీ అధికారులు బయటపెట్టే పనిలో ఉన్నారు.

# అస్త్రాలు..శస్త్రాలు..రెడీ

హైదరాబాద్, జనవరి 1, బహిరంగ సభ అయినా..మీడియా సమావేశం అయినా..చిట్ చాట్ అయినా..సందర్భం ఏదైనా మాజీ సీఎం కేసీఆర్ పేరు ఎత్తకుండా సీఎం రేవంత్ రెడ్డి ఉండలేరు. పోనీ కేసీఆర్ పేరు తీసుకుని వదిలేస్తారా అంటే..ఎడాపెడా మాటలు తూటాలు పేలుస్తారు. బహిరంగ సభలు, మీడియా సమావేశాల్లో కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతున్న మాటలకు ఇప్పటికే బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లు, కేసీఆర్ అభిమానులు హర్ట్ అవుతున్నారట.అలాంటిది కేసీఆర్ అసెంబ్లీకి వస్తే..వివిధ అంశాలపై చర్చ సందర్భంగా కేసీఆర్‌పై నోరుజారకుండా ఉంటారా.? ఇదే ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను ఆందోళనకు గురిచేస్తున్న అంశమట. కేసీఆర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి రావాలని సవాల్ విసురుతున్నారని డౌట్ పడుతున్నారట బీఆర్ఎస్ లీడర్లు. బాస్ సభకు వెళ్తే మంచిదా.? లేకపోతే ప్రెస్‌మీట్లకే పరిమితమైతే బెటరా అనే డైలమాలో ఉన్నారట కారు పార్టీ ముఖ్యనేతలు. 2వ తేదీ నుంచి జరిగే సమావేశాలకు గులాబీ బాస్ హాజరవుతారన్న టాక్ వినిపిస్తోంది. దీంతో ఈ సారి అసెంబ్లీ సెషన్ రసవత్తరంగా జరగనుందని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ సభకు వచ్చి చర్చల్లో పాల్గొంటారన్న ప్రచారం సామాన్య జనంలో క్యూరియాసిటీని పెంచుతోంది.అయితే కేసీఆర్ అసెంబ్లీకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయోనన్నదానిపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కేసీఆర్ గౌరవానికి సభలో భంగం వాటిల్లే ఛాన్స్ ఉందని గులాబీ పార్టీ ముఖ్యనేతలు ఆవేదన చెందుతున్నట్లు తెలంగాణ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కారు పార్టీ లీడర్ల ఆందోళనకు సీఎం రేవంత్ రెడ్డి మాట తీరే కారణమంటున్నారు.కేసీఆర్ పేరు వింటేనే సీఎం రేవంత్ రెడ్డి ఒంటికాలిపై లేస్తున్నారు. కేసీఆర్ పేరును ప్రస్తావించి మరీ విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు సీఎం. అంశం ఏదైనా కేసీఆర్ పేరును ప్రస్తావించి తీవ్రస్థాయిలో మండిపడుతూ వస్తున్నారు రేవంత్. అయితే సీఎం అడ్డూ అదుపు లేకుండా..కేసీఆర్‌ను విమర్శిస్తే ఆయన గౌరవానికి భంగం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు కంగారు పడుతున్నారట.రేవంత్‌కు కౌంటర్ ఇచ్చేందుకు మైక్ కట్ చేయకుండా కేసీఆర్‌కు మాట్లాడే అవకాశం ఇస్తారా లేరా అన్న డౌట్ కూడా వ్యక్తం చేస్తున్నారు గులాబీ పార్టీ నేతలు. కేసీఆర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి రావాలని పదే పదే సవాల్ విసురుతున్నారని, అందుకే బాస్ సభకు వెళ్తే బావుంటుందా..వెళ్లకపోవడమే మంచిదా అన్న ఊగిసలాటలో ఉన్నారట కారు పార్టీ లీడర్లు.అయితే కేసీఆర్ సభకు హాజరుపై పూర్తిస్థాయిలో క్లారిటీ లేదు. నందినగర్ నివాసం నుంచి సార్ ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు. దీంతో సభకు వస్తారా రారా అన్నది డౌటే. కానీ సభకు హాజరైతే మాత్రం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.తనను అవమానించేలా మాట్లాడినా..అధికార పక్షం నేతలు నోరు జారినా..ఎక్కడా టెమ్ట్ కావొద్దని బీఆర్ఎస్ లీడర్లకు ఇండైరెక్ట్‌గా డైరెక్షన్స్ ఇచ్చారట. ఒకవేళ కాంగ్రెస్ నేతలు స్థాయి దిగజారి..తన పరువుకు నష్టం కలిగించేలా బిహేవ్ చేస్తే ఏం చేయాలో..తనకు తెలుసు అన్నట్లుగా నేతలతో చెప్పుకొచ్చారట కేసీఆర్.సభకు రావాలంటూ సవాల్ విసిరి..వ్యక్తిగత విమర్శలు చేశారని ఎక్స్‌పోజ్ చేసి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయాలనే వ్యూహం కూడా ఉందట. అందుకే ఈ సారి పరీక్ష మనకు కాదు..అధికార పక్షానికే అంటున్నారట గులాబీ బాస్. వాళ్ల ఓపిక..తీరిక..మనమ్ మాత్రం సబ్జెక్ట్ తోనే కొడుతాం..పాయింట్ టు పాయింట్ మాట్లాడుతాం..ఎవరేంటో ప్రజలే డిసైడ్ చేస్తారు..డోంట్ వర్రీ అంటూ లీడర్లకు దిశానిర్దేశం చేశారట కేసీఆర్. సార్ సభకు వెళ్తే చర్చలు..వాగ్వాదాలు ఎలా ఉంటాయో చూడాలి మరి.

# హామీల అమల కోసం కసరత్తు

హైదరాబాద్, జనవరి 1, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఇచ్చిన హామీలు ఎంత మేరకు అమలు చేసిందన్న దానిపై కేవలం ఉప ఎన్నికల ఫలితాల ఆధారంగా చూడలేం. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల సమయానికి బయటపడుతుంది. రెండేళ్లలో సిక్స్ గ్యారంటీలను అమలు చేశామని చెప్పుకుంటున్నా ప్రజల్లో మాత్రం పెద్దగా అనుకూలత ప్రభుత్వం పట్ల లేకపోవడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే కాంగ్రెస్ మరో పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెబుతున్నారు. తానే ముఖ్యమంత్రిని అని కూడా ప్రకటించుకున్నారు. కానీ 1995 నుంచి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, 2014 తర్వాత విభజన జరిగిన తెలంగాణలోనూ రెండుసార్లు ఒకే ప్రభుత్వం ఏర్పాటైంది. కానీ ప్రజలు ఆ ప్రాతిపదికగా ఓటు వేస్తారనుకోవడం మాత్రం అనుకోవడం ఖచ్చితంగా అత్యాశే అవుతుంది. 2028 లో తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగాల్సిన సమయంలో 2026లోకి మరికొద్ది గంటల్లో అడుగు పెట్టబోతున్నాం. అంటే చివరి ఏడాది ఎన్నికల సంవత్సరం. ఏం చేసినా రేపటి నుంచి రెండేళ్లు మాత్రమే రేవంత్ సర్కార్ కు సమయం ఉంది. ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నా, వారికి దూరమవ్వాలన్నా ఈ 2026 మాత్రం కీలకం అని చెప్పాలి. ఇప్పటి వరకూ అయితే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ రేవంత్ రెడ్డి నాయకత్వం పట్ల పెద్దగా వ్యతిరేకత లేదు. లోపల ఉన్న ప్పటికీ నేతలు బయటపడటం లేదు. అయితే 2026 పార్టీ పరంగా కూడా రేవంత్ రెడ్డి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.మరొకవైపు సంక్షేమ పథకాలను వివిధ కారణాలతో అందరికీ అందించలేకపోతున్నారు. గతంలో మాదిరిగా అవినీతి ఆరోపణలు పెద్దగా వినిపించకపోయినప్పటికీ పాలనలో అసంతృప్తి మాత్రం స్పష్టంగా కనపడుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. మరొకవైపు సెంటిమెంట్ తో ప్రత్యర్థులు ఎన్నికల బరిలోకి దిగే అవకాశముంది. ఈసారి బీసీల ఓటు బ్యాంకు ఏ పార్టీ గెలుపునకు అయినా కీలకంగా మారనుండటంతో 2026లో రేవంత్ సర్కార్ తీసుకునే ప్రతి నిర్ణయమూ ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించక మానదు. అలాగే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో మిగిలిపోయిన వాటిని కూడా ఈ ఏడాది అమలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే పార్టీకి నష్టం చేకూరే అవకాశముంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద రేవంత్ సర్కార్ కు ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందా? ప్రతికూలత పెరుగుతుందా? అన్నది తేలనుంది.

# మెదక్ లో ఇండస్ట్రియల్ జోన్

మెదక్, జనవరి 1, మెదక్ జిల్లా కొండాపూర్ ఇండస్ట్రియల్ పార్కు తెలంగాణను పారిశ్రామిక హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది. రూ. 1,000 కోట్ల పెట్టుబడితో 64 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో 36 ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు 5,000 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.తెలంగాణను పారిశ్రామిక హబ్‌గా మార్చే దిశగా మెదక్ జిల్లా కొండాపూర్ ఇండస్ట్రియల్ పార్కు కీలక కేంద్రంగా మారుతోంది. ఇక్కడ దాదాపు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించిన పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు.కొండాపూర్ పారిశ్రామికవాడలో మొత్తం 64 పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు లభించాయి. వీటిలో ఇప్పటికే 36 పరిశ్రమలు తమ భవన నిర్మాణాలు, యంత్రాల అమరికను పూర్తి చేసుకున్నాయి. ఇవి కార్యకలాపాలు ప్రారంభిస్తే, స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తక్షణమే 5,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మిగిలిన 28 పరిశ్రమలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయని, అవి కూడా పూర్తయితే ఉపాధి సంఖ్య రెట్టింపు అవుతుందని పేర్కొన్నారుపరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరగకూడదని మంత్రి అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అవసరాలకు సరిపడా విద్యుత్తును సరఫరా చేయడంలో తలెత్తుతున్న సాంకేతిక ఇబ్బందులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కును జాతీయ రహదారితో కలిపే అప్రోచ్ రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉంటేనే ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు సులభమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం చూపిస్తున్న చొరవ పట్ల కొండాపూర్ పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు కె. శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను త్వరగా మంజూరు చేయడం, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్ల పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహంగా ఉన్నామని వారు తెలిపారు.హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం, జాతీయ రహదారుల అనుసంధానం మెరుగ్గా ఉండటంతో మెదక్ జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఉన్న ఫార్మా, ఇంజనీరింగ్ రంగాలతో పాటు కొత్తగా వస్తున్న ఈ 64 పరిశ్రమలు జిల్లా ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. ప్రభుత్వం కూడా 'సింగిల్ విండో' సిస్టమ్ ద్వారా పరిశ్రమలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుండటంతో కొండాపూర్ ప్రాంతం త్వరలోనే ఒక మేజర్ ఇండస్ట్రియల్ జోన్‌గా అవతరించనుంది.

# నదిలో విషపదార్థాలు, రసాయనాలు

నల్గొండ, జనవరి 1, తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాల్లో సాగు,వేలాది గ్రామాలకు తాగునీటిని కృష్ణా నది అందిస్తోంది.అంటే ఏకంగా రెండు రాష్ట్రాల ప్రజలకు జీవనాధారం కృష్ణానది. అలాంటి కృష్ణమ్మ జలాలు రోజురోజుకూ కాలుష్యనీరుగా మారుతుండటం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా నదీ పరీవాహక ప్రాంతాల్లో మురుగునీటిని యథేచ్ఛ గా వదిలేయడం, రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా పారిశ్రామిక వ్యర్థాలు రసాయనాలు కలపడంతో కృష్ణా జలాలను నేరుగా తాగడానికి సందేహ పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్ది రోజులుగా సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గంలో 7 మండలాలు,113 గ్రామాలకు తాగునీరు నిలిచిపోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.తక్షణమే కృష్ణా నదీ పరిరక్షణ, ప్రక్షాళన, కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఒడ్డున కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో విష పదార్థాలు, కెమికల్స్ కలిపి వెళుతున్నారు అని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. దీనిని గమనించిన మట్టపల్లి ప్రజలు,దేవాలయ సిబ్బంది, ఆలయ ధర్మకర్తలకు విషయం చెప్పడంతో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు సోషల్ మీడియా వైరల్ కావడంతో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలుషిత నీటి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.హుటాహుటిన ఇరిగేషన్ శాఖ కోదాడ డివిజన్ ఎస్ఈ నాగభూషన్ కృష్ణ మట్టపల్లిలోని నదిని,నదిలోని నీటిని అధికారులతో పరిశీలించి నీటి శాంపిల్స్ సేకరించారు.అదే విధంగా నదిలో కలుషితమైన రసాయనాలను తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారునదిలోని నీటిని ఇతర అవసరాలకు వాడుతున్నామని, ప్రస్తుతం మంచి నీటి కోసం బోరు నీటినే వాడుతున్నామని గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో బోరు నీరు కూడా కలుషితమయ్యేలా ఉన్నదని,తద్వారా చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టేం దుకు వెళితే నదిలో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానిక జాలర్లు చెప్పారు.కృష్ణానది కలుషితమవుతోన్న సమయంలో ఁ. జలాల పరిరక్షణ, ప్రక్షాళన కోసం తక్షణమే ఇరు రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని మట్టపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో సరైన మురుగు శుద్ధి కేంద్రాలు లేకపోవడం ఉన్నవి కూడా నిండిపోవడంతో పరిశ్రమల వ్యర్థాలను వైజాగ్ వరకు తీసుకెళ్లి సముద్రంలో కలపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇది ఖర్చుతో కూడుకొని ఉండటంతో పరిశ్రమల అధికారులు మార్గమధ్యలోనే ప్రైవేటు వ్యక్తుల ద్వారా నదీ జలాల్లో కలిపేస్తున్నారనిఁ ఫలితంగా కృష్ణానది కాలుష్య నదిగా మారుతోందని తెలిపారు. దీనిపై అధికారులు దృష్టి సారించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవల్సి ఉంటుందని పర్యావరణ ప్రేమికులతో పాటు స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.రెండు తెలుగు రాష్ట్రాలకు సాగునీరు తాగునీరు అందిస్తున్న కృష్ణమ్మ నీటిని కలుషితం చేయడం అత్యంత విషాదకరం. సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రెండో యాదగిరిగుట్టగా పేరుపొందిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఒడ్డున కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో విష పదార్థాలు, కెమికల్స్ కలిపి వెళుతున్నారు అని స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ఈ ఘటనపై మంత్రి ఉత్తమ్ సార్ కఠిన చర్యలు తీసుకుని కృష్ణమ్మ నీటిని యధావిదంగా ఉండే విధంగా చూడాలని స్వామి వారి భక్తులుగా వేడుకుంటున్నాము.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన డాక్టర్ తుమ్మల యుగంధర్



**హైదరాబాద్ ప్రతినిధి జనవరి 01 (ప్రజాబలం)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డాక్టర్ తుమ్మల యుగంధర్ మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలను ముఖ్యమంత్రికి తెలియజేశారు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు సీఎం రేవంత్ రెడ్డికూడా డాక్టర్ తుమ్మల యుగంధర్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలని సూచించారు ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది

# హైదరాబాద్ లో మరో జిల్లా..



హైదరాబాద్, జనవరి 1, రిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త జిల్లాను ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో జిల్లాల పునర్విభజన ప్రక్రియను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పోలీస్ కమిషనరేట్ల పరిధులకు అనుగుణంగా జిల్లాల హద్దులను మార్చడం ద్వారా ప్రజలకు, శాంతిభద్రతల నిర్వహణకు సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణలో మరో కొత్త జిల్లా ఏర్పాటు కానుంది. రాజధాని హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న మూడు పోలీస్ కమిషనరేట్లు నాలుగుగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీగా మారిన నేపథ్యంలో జిల్లాల హద్దులను కూడా కమిషనరేట్ల పరిధితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి ముందే అంటే వచ్చే ఏడాది జనవరి నాటికే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం 16 మండలాలున్న హైదరాబాద్ జిల్లా పరిధిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. తిరుమలగిరి, మారేడ్‌పల్లి మండలాలు, అమీర్‌పేట మండలంలోని బేగంపేట ప్రాంతాన్ని మల్కాజిగిరి జిల్లాలో కలపనున్నారు. ఇప్పటివరకు బండ్లగూడ, బహదూర్‌పుర వరకే ఉన్న జిల్లా హద్దులు, ఇకపై శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల వరకు విస్తరించనున్నాయి. అయితే ఈ మండలాల్లో జీహెచ్ఎంసీ పరిధి ఎంతవరకు ఉంటుందో, అంతవరకే హైదరాబాద్ జిల్లా కిందికి వస్తుంది.మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధికి సమానంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హద్దులను ఖరారు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విలీనం కానున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా ఈ జిల్లా పరిధిలోకి వస్తాయి. అయితే, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జీహెచ్ఎంసీ పరిధికి బయట ఉండటంతో దీనిపై నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉంది.విస్తారమైన భూభాగం, ఐటీ కారిడార్, పరిశ్రమలతో కూడిన రంగారెడ్డి జిల్లాను రెండుగా విభజించనున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు ఉండే ప్రాంతం 'అర్బన్ జిల్లా'గా మారుతుంది. కొత్తగా ఏర్పడిన 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ పరిధిని రూరల్ జిల్లాగా మార్చనున్నారు. ఇందులో షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, మాడ్గుల, యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం వంటి మండలాలు ఉంటాయి.కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధికి సమానంగా ఒక కొత్త జిల్లాను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే హైదరాబాద్, మల్కాజిగిరి జిల్లాల సరిహద్దులను మార్చేందుకు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.రంగారెడ్డి జిల్లా పరిధి విస్తృతంగా ఉండడం, జిల్లా పరిధిలో ఐటీ సంస్థలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలు ఉండడంతో అర్బన్, రూరల్ జిల్లాలుగా విభజించనున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మొత్తాన్ని అర్బన్ జిల్లాగా, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిని రూరల్ జిల్లాగా విభజించనున్నారు.షాద్ నగర్, శంషాబాద్ రూరల్ మండలం, చేవెళ్ల, ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, మాడ్గుల, యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం మండలాలను రూరల్ జిల్లాగా ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు దేశవ్యాప్తంగా 'హౌసింగ్ సెన్సస్' నిర్వహించాల్సి ఉన్నందున.. జనవరి లోపే ఈ జిల్లాల మార్పుపై డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. పోలీస్ స్టేషన్ పరిధి, జిల్లా కలెక్టరేట్ పరిధి ఒకే విధంగా ఉండటం వల్ల సామాన్య ప్రజలకు, శాంతిభద్రతల నిర్వహణకు సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# మున్సిపల్స్ సందడి...

హైదరాబాద్, జనవరి 1,మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. పోలింగ్ కేంద్రాలు, వా ర్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా మున్సిపల్ అ ధికారులు చర్యలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రకారం పోలింగ్ కేం ద్రాల వారీగా ఓటర్లను విభజించే పనిలో ని మగ్నమయ్యారు. ముసాయిదా ఓటరు జా బితాను జనవరి ఒకటో తేదీన ప్రకటించాలనే ఈసీ ఆదేశాలకు అనుగుణంగా వ్యవ హరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎక్కువ సమయం లేకపోవడంతో వార్డుల పునర్విభజన జోలికి వెళ్లకుండా పాత వార్డుల ప్రకారమే నిర్వహించే అవకాశముంది.ఇదిలావుంటే మున్సిపల్ ఎన్నికలకు సై అంటున్న ఆశావహులు తమ ప్రయత్నాలను షురూ చే శారు. బరిలో ఉంటామని తెలిపేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడు తూ ఓటర్లను ఆకర్శించే పని లో పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. సం గారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, ఆందోల్, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, కోహీర్, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీలు ఉండ గా, మెదక్ జిల్లాలో రామాయంపేట, తూ ప్రాన్, నర్సాపూర్, మెదక్ ఉన్నాయి. అలాగే సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు, వార్డుల వారీగా ఓటర్లతో కూడిన ము సాయిదా జాబితాను ఈనెల 31న ప్రకటించాలని ఎస్ఈసీ స్పష్టం చేసిం ది. దీంతో గడువులోపు జాబితా ఎలాగైనా సిద్ధం చేసే దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల సమయం నాటి ఓటర్ల జాబితాలను రెవె న్యూ అధికారుల నుంచి తెప్పించుకున్నారు. జవవరి 5న మున్సిపల్ కార్యాలయాల్లో కమిషనర్ స మావేశం, 6న జిల్లా కేంద్రాల్లో ఎన్నికల అధికారి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. మొత్తంగా అభ్యంతరాలను పరిష్క రించి 10న తుది ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలు వార్డుల వారీగా ప్రకటించనున్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవడం, అధికారులు కసరత్తు ప్రారంభించ డంతో ఆశావాహులు సైతం తమ ప్రయత్నా లు షురూ చేశారు. రిజర్వేషన్లపై ఇంకా ఎ లాంటి స్పష్టత రానప్పటికీ, త్వరలో నోటిఫికేషన్ వచ్చే అవకాశ ముండటంతో పోటీకి సై అంటున్నవారు అంతర్గతంగా ప్రచారం మొదలు పెట్టారు. ఇందుకు సోషల్ మీడియాను ప్రధాన అస్త్రంగా వాడుకుంటున్నా రు. రాజకీయ పార్టీల గుర్తుల ఆధారంగా జరిగే ఎన్నికలు కావడంతో తమ పార్టీల ప్రా ధాన్యతను చాటేలా సోషల్ మీడియా ప్రచా ర పర్వం మొదలెట్టారు. ఓటర్లను ఆకర్షించేలా పోస్టులు పెడుతున్నారు. అధికార కాం గ్రెస్, విపక్ష బీఆర్ఎస్ తమతమ ప్రభు త్వా లు చేసిన, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించేలా పోస్టుల్లో పొందుపరుస్తున్నారు. నో టి ఫికేషన్ విడుదలైతే రాజకీయం మరింత వేడెక్కనుంది. అయితే ఎన్నికల నిర్వహణకు సమయం ఎక్కువగా లేకపోవడంతో వార్డు ల పునర్విభజన జరిగే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

# తేలని పంచాయితీ...

హైదరాబాద్, జనవరి 1, గ్రేటర్ రూపు మారింది. ఔటర్ వరకు విస్తరించింది. 20 మున్సిపాలిటీలు..ఏడు కార్పొరేషన్ల విలీనంతో?మహానగర విస్తీర్ణం పెద్దగా అయిపోయింది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిపోతుంది. అయితే విలీనం తర్వాత గ్రేటర్‌ను మూడు ముక్కలు చేస్తారన్న టాక్ నడిచింది. కానీ గతంలో 150 వార్డులు ఉంటే..ఇప్పుడు 3 వందల వార్డులకు పెంచి ఆ చర్చను వెనక్కి నెట్టింది సర్కార్.డీలిమిటేషన్‌పై పొలిటికల్ పార్టీలు కస్సుబుస్సుమంటుండగానే..జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు అంటూ పోస్టింగ్‌లు ఇచ్చేసింది. అధికారులు కూడా ఎవరికి వారు పైరవీలు, లాబీయింగ్‌లు చేసి కోరుకున్న చోట పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయినా విషయంలో ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టత రావడం లేదు. గ్రేటర్ మొత్తాన్ని ఒకే మున్సిపల్ కార్పొరేషన్ కింద ఉంచుతారా లేక వంద వార్డులకు ఒక కార్పొరేషన్ కింద మూడు ముక్కలు చేస్తారా అన్నది ఇప్పటికీ డౌట్‌గానే ఉంది.విలీనం, విభజనపై గందరగోళం నడుస్తూ ఉండగానే..పోస్టింగులు, ఆఫీసులు..అంటూ అన్నీ చక్కబెట్టే ప్రయత్నం చేస్తోంది రేవంత్ సర్కార్. విలీనం, వార్డుల విభజన లెక్కేంటనేదానిపై విపక్ష పార్టీలకు క్లారిటీ వచ్చేలోపే సర్కార్ డెసిషన్స్ షాకింగ్ మారాయి. కలెక్టర్లు, వివిధ శాఖలకు బాస్‌లుగా పనిచేసిన అధికారులను కమిషనర్ కింద పోస్టింగ్ వేశారు. కొంతమందిని పూర్తిగా డిప్యూటీ కమిషనర్ పోస్ట్ నుంచి తొలగించి జాయింట్ కమిషనర్లుగా నియమించి చర్చకు దారితీశారు బల్దియా బాస్.ఈ పోస్టింగ్‌లల్లో అవినీతి ఆరోపణలు వస్తున్నాయ్. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోగా..అదే హోదాలో కంటిన్యూ చేయడం విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇలా సర్కిల్స్, వార్డులు, జోనల్స్..అధికారుల పరిధిలు ఎన్నో సమస్యలున్నా..సర్కార్ మాత్రం స్పీడ్‌గా డెసిషన్స్ తీసుకోవడం వెనక ప్లానేంటన్నది హాట్ టాపిక్ అవుతోంది. గ్రేటర్‌లో విలీనం, విభజన విషయంలో ఇప్పటికీ చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని..అవేమి పట్టించుకోకుండా సర్కార్ ముందుకెళ్తుందని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. అయినా ఐ డోంట్ కేర్ అంటున్నారు సీఎం రేవంత్. అయితేవిషయంలో రేవంత్ దూకుడు నిర్ణయాల వెనక పెద్ద స్కెచ్చే ఉందంటున్నారు.ఫిబ్రవరిలో పాలక వర్గం గడువు ముగుస్తుంది. దీంతో జనవరి చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు పెట్టి గ్రేటర్‌లో పాగా వేయాలని రేవంత్ ప్లాన్ అంటున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందు. ఎలక్షన్స్ పెట్టి తీరాలని భావిస్తున్నారట. జనవరి చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలంటే అంతా లోపే మొత్తం సెట్ చేయాలని డిసైడ్ అయ్యారట.అందుకే విపక్షాలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా..లాస్ట్‌కు కొందరు కోర్టుకు వెళ్లినా అన్ని అడ్డంకులను దాటి వార్డుల విభజన..సర్కిల్స్, జోన్ల వారీగా అధికారులకు పోస్టింగ్ వంటి కీలక డెసిషన్స్ తీసుకున్నారని అంటున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా మారిన బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా ఓ క్లారిటీకి వచ్చారట. బీసీ కోటా అంశం కోర్టులో ఉండటంతో చట్ట ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి..పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నారట.జనవరి మధ్యలో సంక్రాంతి పండగ ముగిసిన వెంటనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ అయ్యే అవకాశం ఉందంటున్నారు. ఫిబ్రవరిలో మూడు విడతల్లో పోలింగ్ పెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట. మార్చిలో విద్యార్థులకు ఎగ్జామ్స్ ఉండటంతో, ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఎన్నికల ప్రక్రియను క్లోజ్ చేయాలని భావిస్తున్నారట. గ్రేటర్‌పై రేవంత్ వ్యూహం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి మరి.

# అమరావతిపై జాతీయ మీడియా స్టోరీలు

విజయవాడ, జనవరి 1, 2025 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం... అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రయాణం వంటి కీలక పరిణామాలకు ఈ ఏడాది సాక్ష్యంగా నిలిచింది. ఎన్నికల హామీకి అనుగుణంగా రాజధాని పనులను

పట్టాలెక్కించడం ఈ ఏడాదికే తలమానికంగా నిలిచింది. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థ ఐఏఎన్ఎస్ ఓ కథనం వెలువరించింది.దాదాపు పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి పనులను, 2025 మే 2న ఆయన చేతుల మీదుగానే మళ్లీ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కలల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నారు. హైకోర్టు, శాసనసభ, సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల వంటి రూ. 56,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులు తిరిగి మొదలయ్యాయి. 2028 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేస్తామని సీఎం ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో అమరావతిలో రెండో దశ భూ సమీకరణకు కూడా శ్రీకారం చుట్టారు. అమరావతిని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో 'క్వాంటమ్ వ్యాలీ'గా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలను ప్రభుత్వం ప్రకటించింది.రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహంలో విశాఖపట్నంలో గూగుల్ తన అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం ఒక మైలురాయిగా నిలిచింది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొన్న ప్రకారం, ఈ పరిణామం విశాఖ రూపురేఖలను మార్చేస్తుందని ఐటీ మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. గూగుల్ ఐదేళ్లలో పెట్టనున్న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గత 16 నెలల్లో రాష్ట్రం 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 10 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించిందని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో ఏకంగా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 610 ఎంఓయూలు కుదిరాయి.రాష్ట్రంలో మూడు ఆర్థిక కారిడార్లను అభివృద్ధి చేస్తూ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖపట్నం, అమరావతి, రాయలసీమ ప్రాంతాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలన్న 'సూపర్ సిక్స్' హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.సంక్షేమ రంగంలోనూ ప్రభుత్వం తనదైన ముద్ర వేసింది. 'తల్లికి వందనం' పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు అందించారు. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే, 'అన్నదాత సుఖీభవ' కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,310 కోట్లు జమ చేశారు. ఎన్టీఆర్ భరోసా కింద 63 లక్షల మందికి ఏటా రూ. 33,000 కోట్ల పింఛన్లు అందిస్తున్నారు.పరిపాలనలో పారదర్శకత కోసం వాట్సాప్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో డేటా ఆధారిత నిర్ణయాలు వంటి ఆధునిక పద్ధతులను ప్రభుత్వం అనుసరిస్తోంది. 2029 నాటికి పేదరికం లేని

రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే లక్ష్యంతో 'పీ4' (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించడం ఈ ఏడాదిలోని మరో విశేషం. మొత్తం మీద 2025 సంవత్సరం అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలతో ఏపీకి ఒక బలమైన పునాది వేసింది.

# జర్మనీలో తెలంగాణ యువకుడు దుర్మరణం

హైదరాబాద్, జనవరి 1, ప్రపంచమంతా 2026 నూతన సంవత్సర వేడుకల్లో మునిగి తేలుతున్న వేళ, జర్మనీ నుంచి వచ్చిన ఒక చేదు వార్త తెలంగాణలోని ఓ కుటుంబంలో విషాదం నింపింది. తెలంగాణ రాష్ట్రం, జనగామ జిల్లా, చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిక్ రెడ్డి ఉన్నత విద్యాభ్యాసం కోసం జర్మనీ వెళ్లి, అక్కడ జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నూతన సంవత్సరం ఆరంభంలోనే ఈ దుర్ఘటన జరగడం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. మల్కాపూర్ నుంచి వచ్చిన హృత్రిక్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని, తన కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని కలలుకన్నాడు. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన హృతిక్ జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడం తన కుటుంబానికి ఎంతో గర్వకారణంగా భావించాడు. అక్కడే ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. కానీ విధి ఆడిన వింత నాటకంలో అతని ఆశయాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. జర్మనీ అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, జనవరి 1న హృతిక్ నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో హృతిక్ లోపలే ఉన్నాడు. మంటలు వేగంగా వ్యాపించడంతో బయటకు వచ్చే మార్గం కనిపించక ప్రాణ భయంతో వేగంగా వ్యాపించడంతో బయటకు వచ్చే మార్గం కనిపించక ప్రాణ భయంతో అతను కిటికీ నుంచి కిందకు దూకాడు. ఈ క్రమంలో అతని తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. స్థానికులు, అగ్ని మాపక సిబ్బంది అతన్ని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అతను

మరణించినట్లు వైద్యులు చెప్పారు. భవనంపై నుంచి దూకం, తలకు గాయం కారణంగా యువకుడు మరణించాడని జర్మన్ అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై జర్నన్ పోలీసులు లోతైన ద్యాప్తు చేస్తున్నారు. అగ్ని ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏంటీ, భవనంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా అన్న కోణాల్లో విచారణ జరుగుతోంది. భారత రాయబారి కార్యాలయం ఈ విషయంలో యాక్టివ్‌గా స్పందించింది. హృతిక్ రెడ్డి కుటుంబానికి సమాచారం అందించడంతోపాటు మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తరలించేందుకు అవసరమైన దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. ఎంబసీ అధికారులు జర్మన్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన పేపర్ వర్క్ , క్లియరెన్స్‌లను పూర్తి చేస్తున్నారు. హృతిక్ మరణవార్త మల్కాపూర్ గ్రామానికి చేరగానే అక్కడ నిశ్శబ్ధ వాతావరణం ఏర్పడింది. తన కుమారుడు ఉన్నత చదువులు చదివి తిరిగి వస్తాడని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు, నూతన సంవత్సర కానుకా శవమై వస్తున్నాడన్న వార్త విని గుండ పగిలేలా విలపిస్తున్నారు. గ్రామస్తులు, బంధువులు హృతిక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు తరలి వస్తున్నారు. విదేశాలకు వెళ్లే యువతకు ఒక ఆదర్శంగా నిలిచిన హృతిక్ ఇలాంటి స్థితిలో తిరిగి రావడం గ్రామ యువతను కూడా కలిచి వేస్తోంది.


# ధురంధర్ మూవీలో మార్పులు




న్యూఢిల్లీ, జనవరి 1,(న్యూస్ పల్స్) బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఇప్పటికే ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా రికార్డు సృష్టించిన ఈ సినిమాను, కొన్ని కీలక మార్పులతో ఇవాళ థియేటర్లలో రీ-రిలీజ్ చేశారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు చిత్రంలో వివాదాస్పదంగా మారే అవకాశం ఉన్న 'బలోచ్' అనే పదాన్ని మ్యూట్ చేసినట్లు సమాచారంచిత్రంలో కొన్ని పదాలను, డైలాగులను తొలగించాలని కేంద్రం చిత్ర బృందానికి సూచించింది. ఈ మేరకు డిస్ట్రిబ్యూటర్లు నిన్న (డిసెంబర్ 31) దేశవ్యాప్తంగా ఉన్న థియేటర్ యాజమాన్యాలకు ఈ-మెయిల్స్ పంపారు. పాత ప్రింట్ స్థానంలో మార్పులు చేసిన కొత్త డిజిటల్ సినిమా ప్యాకేజీని (ఆఅఖ) డౌన్‌లోడ్ చేసుకుని, జనవరి 1 నుంచి ప్రదర్శించాలని కోరారు. ఇందులో రెండు పదాలను మ్యూట్ చేయగా, ఒక డైలాగ్‌ను మార్చారు. మ్యూట్ చేసిన పదాల్లో ఒకటి పాకిస్థాన్‌కు సంబంధించిన 'బలోచ్' కాగా, రెండో పదం, మార్చిన డైలాగ్ వివరాలు ఇంకా తెలియరాలేదు.'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం పాకిస్థాన్ సామాజిక ఘర్షణలు, ఉగ్రవాదానికి, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య ఉన్న సంబంధాల నేపథ్యంలో సాగుతుంది. ఇందులో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, ఆర్.మాధవన్, సంజయ్ దత్ వంటి భారీ తారాగణం నటించింది. ఈ కథ వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన కల్పిత గాథ అని సెన్సార్ బోర్డు ఇప్పటికే స్పష్టం చేసింది. రాజకీయ, సామాజిక సున్నితత్వం దృష్ట్యా కేంద్రం ఈ తాజా మార్పులను సూచించినట్లు తెలుస్తోంది.

# రూ..2.5 కోట్ల ప్యాకేజితో చరిత్ర సృష్టించిన ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి

ఐఐటీ హైదరాబాద్ విద్యార్థికి రూ. 2.5 కోట్ల రికార్డు ప్యాకేజీ
సంస్థ చరిత్రలోనే ఇది అత్యధిక వార్షిక వేతనం
ఇంటర్న్‌షిప్‌ను ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్‌గా అందుకున్న ఎడ్వర్డ్ వర్గీస్
ఈ ఏడాది సంస్థ సగటు ప్యాకేజీ 75 శాతం వృద్ధితో రూ. 36.2 లక్షలకు చేరిక
మొదటి దశలో 62 శాతం యూజీ విద్యార్థులకు ఉద్యోగాలు




హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ- హైదరాబాద్) విద్యార్థి భారీ ప్యాకేజీతో సంచలనం సృష్టించాడు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎడ్వర్డ్ నాథన్ వర్గీస్‌కు నెదర్లాండ్స్‌కు చెందిన గ్లోబల్ ట్రేడింగ్ సంస్థ ఆప్టివర్ ఏకంగా రూ. 2.5 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. 2008లో ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటైన నాటి నుంచి ఇదే అత్యధిక ప్యాకేజీ కావడం విశేషం.

ఈ ఆఫర్ రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్ ద్వారా ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్ (పీపీఓ)గా వచ్చింది. ఈ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఇద్దరిలో వర్గీస్ ఒక్కరే పీపీఓ అందుకోవడం గమనార్హం. 21 ఏళ్ల వర్గీస్ జులై నుంచి ఆప్టివర్ నెదర్లాండ్స్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పూర్తిస్థాయిలో విధుల్లో చేరనున్నాడు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన వర్గీస్, తన తల్లిదండ్రులిద్దరూ ఇంజినీర్లేనని తెలిపారు.ఈ విజయంపై వర్గీస్ మాట్లాడుతూ, ఃఃఇదే నా మొదటి, ఏకైక ఇంటర్వ్యూ. పీపీఓ వస్తుందని నా మెంటార్ చెప్పినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. ఫస్ట్ ఇయర్ నుంచి కాంపిటేటివ్ ప్రోగ్రామింగ్‌లో దేశంలోని టాప్ 100లో ఉండటం ఇంటర్వ్యూలో నెగ్గడానికి బాగా ఉపయోగపడింది. ఐఐటీ ట్యాగ్ కూడా కలిసొచ్చిందిఃః అని వివరించారు.

ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో మరో కంప్యూటర్ సైన్స్ విద్యార్థి రూ. 1.1 కోట్ల ప్యాకేజీని అందుకోవడం విశేషం. ఈ ఏడాది సంస్థ సగటు ప్యాకేజీ గత ఏడాదితో పోలిస్తే 75 శాతం పెరిగి రూ. 20.8 లక్షల నుంచి రూ. 36.2 లక్షలకు చేరింది. డిసెంబరులో ముగిసిన మొదటి దశ ప్లేస్‌మెంట్లలో 487 మంది యూజీ విద్యార్థులకు గాను 62 శాతం మంది ఉద్యోగాలు పొందారు.

అధిక ప్యాకేజీల కంటే, ప్లేస్‌మెంట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులందరికీ మంచి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని కెరీర్ సర్వీసెస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి మయూర్ వైద్య తెలిపారు. టెక్ ఉద్యోగాలతో పాటు కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కూడా మంచి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామని ఆయన చెప్పారు. త్వరలో ప్రారంభం కానున్న ఫేజ్-2 ప్లేస్‌మెంట్లలో మరిన్ని దేశీయ కంపెనీలు పాల్గొంటాయని ఐఐటీహెచ్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# భారీగా పెరిగిన కమర్షియల్ గ్యాస్

హైదరాబాద్, జనవరి 1, కొత్త సంవత్సరం ప్రారంభంతోనే సామాన్యులకు ధరల పెరుగుదల రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నూతన సంవత్సరంలో మొదటి రోజే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచాయి. జనవరి 1, 2026 నుంచి దేశవ్యాప్తంగా 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలు రూ. 111 వరకు పెరిగాయి.హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైతో సహా అన్ని ప్రధాన నగరాల్లో కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. అయితే, 14 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో ప్రస్తుతం ఎటువంటి మార్పు లేకపోవడం ఊరటనిచ్చే అంశం.ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు జనవరి 1, 2026 నుంచి కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొత్త రేట్లను అమలులోకి తెచ్చాయి. ఈ ధరల పెరుగుదల నేరుగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారులపై ప్రభావం చూపనుంది.

హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలలో ఎంత పెరిగాయి!ొత్త రేట్ల ప్రకారం, రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ఇప్పుడు రూ. 1580.50కి బదులుగా రూ. 1691.50కి లభిస్తుంది. కోల్‌కతాలో దీని ధర రూ. 1684 నుంచి రూ. 1795కి పెరిగింది. ముంబైలో గతంలో రూ. 1531.50కి లభించిన సిలిండర్ ఇప్పుడు రూ. 1642.50కి చేరింది. చెన్నైలో దీని ధర రూ. 1739.50 నుంచి రూ. 1849.50కి పెంచబడింది. హైదరాబాద్‌లో దీని ధర రూ. 1,912.50కి పెరిగింది. గతంలో డిసెంబర్ 1, 2025న కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలలో కోత విధించారు. ఆ సమయంలో ఢిల్లీ, కోల్‌కతాలో రూ. 10, ముంబై, చెన్నైలలో రూ. 11 వరకు ఉపశమనం కల్పించారు.అంతేకాకుండా, నవంబర్ 2025 మొదటి తేదీన కూడా 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలను తగ్గించారు. అప్పుడు ఢిల్లీలో ధర రూ. 1595.50 నుంచి రూ. 1590కి, కోల్‌కతాలో రూ. 1700.50 నుంచి రూ. 1694కి, ముంబైలో రూ. 1547 నుంచి రూ. 1542కి, చెన్నైలో రూ. 1754.50 నుంచి రూ. 1750కి తగ్గించారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలలో నిరంతరం మార్పులు జరుగుతుండగా, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలు చాలా కాలంగా స్థిరంగా ఉన్నాయి. 14 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరలు ఏప్రిల్ 2025 స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ హైదరాబాద్‌లో రూ.905, ఢిల్లీలో రూ. 853, కోల్‌కతాలో రూ. 879, ముంబైలో రూ. 852, చెన్నైలో రూ. 868కి లభిస్తోంది. నూతన సంవత్సర ప్రారంభంలో కమర్షియల్ సిలిండర్ల ధరలు పెరగడంతో ఆహార పదార్థాలు, ఇతర సేవల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# కొత్త ఏడాది విషాద ఘటనలు

హైదరాబాద్, జనవరి 1, తెలుగు రాష్ట్రాల్లో 2025కు వీడ్కోలు పలుకుతూ, 2026కు స్వాగతం పలికే క్రమంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో విషాదాలు చోటు చేసుకున్నాయి. పల్లె నుంచి పట్టణం వరకు సామాన్యులు, సెలబ్రిటీలు అంతా ఉత్సాహంగా వేడుకల్లో మునిగిపోయారు. పలు చోట్ల జరిగిన ఘోర ప్రమాదాలు, ఘర్షణలు పండగ పూట తీరని దుఃఖాన్ని నింపాయి.

అనంతపురంలో అమానవీయ ఘటన

అనంతపురం జిల్లా రాప్తాడు మండల పరిధిలోని హార్మోనీ సిటీలో అమానవీయ ఘటన జరిగింది. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ మంగ్లీ సహా ఇతర సెలబ్రిటీలు భారీ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ పనుల కోసం వెళ్లిన షౌకత్ అనే కుర్రాడు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు. జనరేటర్ పవర్ సప్లైలో తలెత్తిన లోపం కారణంగా యువకుడు మృతి చెందాడు. అయితే దీన్ని పట్టించుకోకుండా ఈవెంట్ నిర్వాహకులు సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. ఈవెంట్ వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లాలని చూసినా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈవెంట్ కోసం వెయ్యి నుంచి పాతిక వందల వరకు వసూలు చేసిన నిర్వాహకులు

భద్రతను గాలికి వదిలేశారని మృతుడి బంధువులు ఆరోపించారు.

జగద్గిరిగుట్టలో బిర్యానీ విషాదం

మేడ్చల్ జిల్లా జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానీ నగర్‌లో స్నేహితులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న విందు ప్రాణాంతకంగా మారింది. 31వ తేదీ రాత్రి మద్యం సేవించి, బిర్యానీ తిన్న మొత్తం 17 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాండు అనే 53ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మరో 15 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వేడుకల వేళ ఆహార నాణ్యత, మద్యంలో కల్తీ జరిగే అవకాశం ఉన్నందున ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్వేది బీచ్‌లో విషాదం

కోస్తాంధ్రలో వేడుల కోసం యువతకు సముద్రం మృత్యు పాశమైంది. కాకినాడకు చెందిన ముగ్గురు యువకులు అంతర్వేది బీచ్‌కు తమ థార్ కారులో వెళ్లారు. రాత్రి 1 గంటల తర్వాత బీచ్‌లో డ్రైవ్ చేస్తుండగా అన్నా చెల్లెళ్ల గట్టు వద్ద మలుపును గమనించక పోవడంతో కారు నేరుగా సముద్రంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం నుంచి ఒక యువకుడు చాకచక్యంగా కారు నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. మరో

యువకుడు కారుతో సహా సముద్రంలో మునిగిపోయాడు. జగ్గయ్యపేటలో కేక్ కటింగ్ వివాదం

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వేడుకల ఉత్సాహం హింసకు దారి తీసింది. తొర్రగుంటపాలెం రోడ్డుపై కొందరు యువకులు నడిరోడ్డుపై కేక్ కట్ చేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో కారులో వచ్చిన యువకులు వారితో ఘర్షణ పడ్డారు. ఈ వివాదం ముదిరింది. కారులో ఉన్న యువకులపై దాడి చేశారు. తీవ్ర గాయాలతో వారంతా ఆసుపత్రిలో చేరారు.

## క్యాన్సర్ బాధితులకు టీపీసీసీ జగ్గారెడ్డి ఆర్థిక సహాయం

**రెండు లక్షల చొప్పున ఐదు మంది క్యాన్సర్ పేషెంట్లకు తక్షణ సహాయం అందజేగుట్కా తినకండి, సిగరెట్ తాగకండి.. క్యాన్సర్ బారిన పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయకండి ప్రజలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపు**



సంగారెడ్డి జనవరి 1 ;సంగారెడ్డి నియోజకవర్గం లో క్యాన్సర్ బారిన పడిన నిరుపేదలకు జగ్గారెడ్డి తన సహాయాన్ని కొనసాగిస్తున్నాడు. గతం లో క్యాన్సర్ బారిన పడ్డ వ్యక్తులకు చికిత్స కోసం లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేసిన విషయం తెల్సిందే. తాజాగా క్యాన్సర్ తో బాధ పడుతున్న మరో ఐదు మందికి జగ్గారెడ్డి రెండు లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా గుట్కా నమలడం కారణంగా అనారోగ్యం భారిన పడ్డ క్యాన్సర్ పేషంట్ పట్ల కాస్త ఆగ్రహం వ్యక్తంచేశారు. గుట్కా, సిగరెట్ తాగడం వంటి దురలవాట్ల కారణంగా క్యాన్సర్ బారిన పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని ప్రజలను కోరారు.

# ఏలూరులో దారుణం...

ఏలూరు, జనవరి 1,  ఏలూరులో దారుణం జరిగింది. 8 ఏళ్ల ప్రేమను పెళ్లి పీటల వరకు తీసుకెళ్లిన ఒక జంటపై, పరువు పేరిట యువతి కుటుంబ సభ్యులు చేసిన దాడి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ముసునూరు మండలం రమణక్కపేట సాక్షిగా జరిగిన ఈ అమానుష ఘటన సంచలనంగా మారింది. మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన కుందుల సాయిదుర్గ, రమణక్కపేట ఉప తపాల కార్యాలయంలో పోస్టు ఉమెన్‌గా పని చేస్తోంది. విద్యావంతురాలైన ఆమె, అదే గ్రామానికి చెందిన పల్లం సాయి చంద్ అనే యువకుడిని గత 8ఏళ్లుగా ప్రేమిస్తోంది. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం కేవలం ఆకర్షణ మాత్రమే కాదని, 8 ఏళ్ల సుదీర్ఘ కాలం నిరూపించింది. అయితే వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో చివరకు ప్రేమను గెలిపించుకోవాలనే పట్టుదలతో గత మంగళవారం ఏలూరులోని గంగానమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నారు. శాపంగా మారిన సంతోషం

తమ వివాహం పట్ల ఎంతో సంతోషంగా ఉన్న ఈ జంట, ఆ మధుర స్మృతులను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. పెళ్లి ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడమే వారిపై దాడికి తక్షణ కారణమైందని తెలుస్తోంది. తమ మాట కాదని పెళ్లి చేసుకోవడమే కాకుండా, ఆ ఫోటోలను బహిరంగంగా ఉంచడం యువతి బంధువులకు ఆగ్రహాన్ని కలిగించింది.  పెళ్లి జరిగిన మరుసటి రోజు బుధవారం సాయి చంద్ రమణక్కపేట పోస్టాఫీసు వద్ద ఉన్న సమయంలో యువతి తల్లిదండ్రులు, బంధువులు ఒక్కసారిగా అతడిపై విరుచుకుపడ్డారు. చుట్టుపక్కల జనం చూస్తుండగానే, అతడిని ఒక స్తంభానికి కట్టేసి కర్రలు, రాళ్లతో కిరాతకంగా దాడి చేశారు.

ఈ దాడి ఎంత తీవ్రంగా ఉందంటే, యువకుడు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతని భార్యను బలవంతంగా ఒక కారులో ఎక్కించుకొని అక్కడి నుంచి తీసుకెళ్లి పోయారు. ఈ దారుణ కాండలో కేవలం ఆ జంట మాత్రమే కాకుండా, ఏ సంబంధం లేని మరో ఉద్యోగి కూడా బలి కావాల్సి వచ్చింది. చెక్కపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో పని చేస్తున్న చెన్నకేశ్వరి అనే ఉద్యోగిని, ఈ పెళ్లికి సహకరించారనే నెపంతో యువతి బంధువులు చితకబాదారు. విధి నిర్వహణలో ఉన్న ఒక మహిలా ఉద్యోగినిపై ఇలాంటి దాడి జరగడం పోస్టల్ శాఖ సిబ్బందిలో కూడా భయాందోళనలు రేకెత్తించింది. తీవ్రంగా గాయపడిన సాయిచంద్, చెన్నకేశ్వరిని స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసులో పోలీసుల పాత్రపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వివాహం జరిగిన వెంటనే తమకు తమ కుటుంబ సభ్యుల నుంచి ప్రాణ హాని ఉందని సాయిచంద్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. అయినప్పటికీ మరుసటి రోజే ఇంత పెద్ద దాడి జరగడం పోలీసుల నిఘా వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. ఈ దాడికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

# జేసీ ప్రభాకరరెడ్డి..దీక్ష

అనంతపురం, జనవరి 1, జేసీ ప్రభాకర్ రెడ్డి .. ఈ పేరు గురించి రాష్ట్రంలో అందరికీ తెలుసు. ఆయన ఒక్క సారే ఎమ్మెల్యే అయ్యారు కానీ.. మళ్లీ మున్సిపల్ వార్డు మెంబర్ గా పోటీ చేసి గెలిచి మున్సిపల్ చైర్మన్ అయ్యారు. ఎందుకంటే ఊరుని అభివృద్ధి చేసుకోవాలని అంటున్నారు. ఆయనకు ఊరు మీద అంతటి ప్రేమ ఉంటుంది. హఠాత్తుగా ఆయన దీక్ష ప్రారంభించారు. కొత్త ఏడాదిలో ఆయన దీక్షచేస్తున్నారంటే అందరూ ఏదో లొల్లి ఉంటుందని అనుకున్నారు కానీ.. ఆయన దీక్ష ఈ సారి వెరైటీగా ఉంది. తన ప్రవర్తన గురించి తాడిపత్రిలో అందరూ ఏవోవో అనుకుంటున్నారని.. అందరూ తన కోపాన్నే చూస్తున్నారని కానీ తన లక్ష్యం ఊరుని బాగు చేసుకోవడానికేనని ఆయన

చెబుతున్నారు. తాడిపత్రి కోసం ఎన్ని పనులు చేశాను. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ గా తాను ఎంత నిధులు ఖర్చు చేశాను, ఏ ఏ అభివృద్ధి పనులకు ఎంత వెచ్చించాను అనే వివరాలను ఫ్లెక్సీలో ముద్రించి  తన దీక్ష దక్కర ఏర్పాటు చేశారు.  గాంధీ బొమ్మ సెంటర్ లో దీక్షా వేదిక ఏర్పాటు చేస్తున్న ఆయన  తన మనసులోని అభిప్రాయాలను ప్రజలకు చెప్పారు. తన ప్రవర్తనపై ప్రజల్లో అపోహల ?ఉన్నాయని ప్రజల అభిప్రాయం మేరకే తన ప్రవర్తనను మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 2026లో తాడిపత్రిని మరింత అభివృద్ధి చేస్తానని చెబుతున్నారు.

ప్రజలకు ఏమైనా సందేహాలుంటే తనను నేరుగా సంప్రదించేందుకు ఫోన్ ద్వారా కూడా అందుబాటులో ఉంటానని చెబుతున్నారు. వారు అడిగే ప్రతి రూపాయికి లెక్క చెప్తా అని ప్రకటించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇటీవలి కాలంలో విచిత్రంగా ప్రవర్తిస్తున్నారన్న అభిప్రాయాలు పట్టణ వాసుల్లో ఉన్నాయి. ఆయన తరచూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతూండటంతో ఆయన ఇలా తనను సరిదిద్దాలని దీక్ష చేపట్టారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. తాడిపత్రి మున్సిపల్ కు కూడా ఎన్నికలు జరుగుతాయి. ఈ క్రమంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇలా తన పనితీరును ప్రజల ముందు పెట్టారని.. అంటున్నారు. వివాదాస్పద అంశాల విషయాలనూ మార్చుకుంటానని ఆయన చెప్పడం ఆసక్తికరంగా మారుతోంది.

దేశంలోని అత్యుత్తమ మునిసిపాలిటీల్లో ఒకటిగా తాడిపత్రి గుర్తింపు పొందింది. అయితే అక్కడ రాజకీయాల కారణంగా ఎప్పుడూ తాడిపత్రి అభివృద్ధి గురించి పెద్దగా ప్రచారంలోకి రాదు. ఆ నగరంలో

పచ్చనదం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఇంటి ముందు చెట్లు పెంచకపోతే జేసీ ప్రభాకర్ రెడ్డి అంగీకరించరు. ఆయన సోదరుడు జేసీ దివాకర్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన మున్సిపాలిటీ చైర్మన్ గా పని చేసేవారు. ఊరు విషయంలో ప్రతి విషయాన్ని ఆయన చాలా జాగ్రత్తగా డీల్  చేస్తారు.

# గ్రేటర్ హైదరాబాద్ మ్యాప్‌లో పెను మార్పులు

హైదరాబాద, జనవరి 1,  తెలంగాణ రాజధాని భాగ్యనగరం మరో చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. కేవలం భౌగోళికంగానే కాకుండా పాలనాపరంగా కూడా హైదరాబాద్ ముఖ చిత్రాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల సరిహద్దులు వేర్వేరుగా ఉండటం వల్ల తలెత్తుతున్న పాలనాపరమైన చిక్కులకు ముగింపు పలకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

ఈ మేరకు జిల్లాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది.ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పోలీస్ కమిషనరేట్ల హద్దులు ఒకలా, రెవెన్యూ జిల్లాల హద్దులు మరోలా ఉన్నాయి. దీని వల్ల శాంతిభద్రతల పరిరక్షణలోనూ, రెవెన్యూ సేవల్లోనూ సమన్వయ లోపం ఏర్పడుతోంది. దీనిని అధిగమించడానికి కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌తోపాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిని ప్రాతిపదికగా తీసుకొని జిల్లాల సరిహద్దులను మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఉన్న హైదరాబాద్ జిల్లా పరిధిలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. నగరం మధ్యలో ఉన్న 16 మండలాల్లో కొన్నింటిని ఇతర జిల్లాల్లోకి మార్చడం ద్వారా పాలనను సులభతరం చేయనున్నారు.

మల్కాజిగిరిలోకి కీలక మండలాలు: సికింద్రాబాద్ పరిధిలోకితిరుమలగిరి, మారేడ్‌పల్లి మండలాలను మల్కాజిగిరి జిల్లాలోకి చేర్చనున్నారు.

బేగంపేట మార్పు; అమీర్‌పేట మండలంలోని కీలకమైన బేగంపేట ప్రాంతం కూడా మల్కాజిగిరిలోకి మార్చాలని చూస్తున్నారు.

హైదరాబాద్ విస్తరణ: హైదరాబాద్‌జిల్లా సరిహద్దులు శంషాబాద్, రాజేంద్రనగర్ వైపు విస్తరించనున్నాయి. అయితే సదరు మండలాల్లో జీహెచ్ఎంసీ పరిధి ఎంత వరకు ఉంటుందో అంత వరకు మాత్రమే హైదరాబాద్ జిల్లాలోకి వస్తుంది.

మేడ్చల్- మల్కాజిగిరి విస్తరణ

మల్కాజిగిరి జిల్లా ఇప్పుడు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధి ఎంత వరకు ఉందో అంత వరకు విస్తరిస్తారు.

రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్ నగర్ మండలాలు ఇకపై మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల్లో కలవనున్నాయి.

అంటే ఈ లెక్క ప్రకారం ఎల్బీ నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోకి రానున్నాయి.

రెండుగా రంగారెడ్డి జిల్లా

పరిపాలన సౌలభ్యం కోసం రంగారెడ్డి జిల్లాను రెండుగా విభజించనున్నారు. ఐటీ హబ్‌లు, భారీ పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలతో ఉన్న ప్రాంతాలను ఒక జిల్లాగా, గ్రామీణ ప్రాంతాలను మరో జిల్లాగా మార్చనున్నారు. సైబరాబాద్‌పోలీస్ కమిషనరేట్ పరిధి మొత్తాన్ని కలిపి రంగారెడ్డి అర్బన్ జిల్లాగా మార్చనున్నారు. కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిని రంగారెడ్డి రూరల్ జిల్లాగా మారుస్తారు. ఇందులో షాద్‌నగర్, శంషాబాద్ రూరల్, చేవెళ్ల, ఆమనగల్లు, మహేశ్వరం వంటి మండలాలు ఉంటాయి. ఈ భారీ మార్పులకు సంబంధించిన డ్రాఫ్ట్ త్వరలోనే విడుదల కానుంది. 2027లో జనాభా లెక్కల కంటే ముందే ప్రక్రియ పూర్తి

చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు సెన్సస్‌జరగనుంది. జనవరి లోపు పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఇరాన్ లో రోడెక్కిన జనాలు

న్యూఢిల్లీ, జనవరి 1, (న్యూస్ పల్స్) ఆయిల్ నిక్షేపాలు పుష్కలంగా ఉన్న దేశమైనప్పటికీ, ఇరాన్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. డిసెంబర్ 2025 చివరి వారం నుండి టెహ్రాన్ సహా ప్రధాన నగరాల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.    ఇరాన్ నేడు అత్యంత దారుణమైన కరెన్సీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఇరాన్ కరెన్సీ  రియాల్ విలువ రికార్డు స్థాయిలో పడిపోయిందియ ఒక డాలర్‌కు సుమారు 14.2 లక్షల రియాల్స్‌కు పైగా చెల్లించాల్సి వస్తోంది.  ఈ కరెన్సీ పతనం కారణంగా ద్రవ్యోల్బణం 42 శాతానికి పైగా పెరిగింది. దీని ప్రభావంతో నిత్యావసర వస్తువులు, ఆహారం, మందుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయి. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, గత ఏడాదితో పోలిస్తే ఆహార పదార్థాల ధరలు 70 శాతానికి పైగా పెరగడం ప్రజలను ఆగ్రహానికి గురిచేసింది. పెరిగిన ధరలు , వ్యాపారం చేయడం అసాధ్యంగా మారడంతో టెహ్రాన్‌లోని చారిత్రాత్మక  గ్రాండ్ బజార్  వ్యాపారులు తమ షాపులను మూసివేసి నిరసన బాట పట్టారు. తొలుత మొబైల్ మార్కెట్లు, చిన్న వ్యాపారులతో మొదలైన ఈ ఆందోళనలు, క్రమంగా విద్యార్థులు, కార్మికులు , సాధారణ పౌరులకు విస్తరించాయి. టెహ్రాన్ వీధుల్లో ప్రజలు భారీ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. ఇజ్రాయెల్‌తో ఇటీవలి యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ ఆంక్షల  వల్ల పరిస్థితి మరింత విషమించింది.

పెట్రోలియం ఎగుమతుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ ఇరాన్ ఈ స్థితికి చేరడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, అమెరికా , ఇతర పశ్చిమ దేశాలు ఇరాన్ అణు కార్యక్రమాలపై విధిస్తున్న కఠినమైన ఆర్థిక ఆంక్షలు. దీనివల్ల ఇరాన్ అంతర్జాతీయ మార్కెట్లో స్వేచ్ఛగా చమురు అమ్ముకోలేకపోతోంది. రెండు, దేశీయ వనరుల నిర్వహణలో వైఫల్యం,  హమాస్, హిజ్బుల్లా వంటి విదేశీ గ్రూపులకు ఇచ్చే భారీ ఆర్థిక మద్దతు వల్ల ఇరాన్ పరిస్థితి మరింత దిగజారింది.  మాకు గాజా వద్దు.. లెబనాన్ వద్దు.. మా దేశాన్ని కాపాడండి అంటూ నిరసనకారులు చేస్తున్న నినాదాలు ప్రజల అసంతృప్తికి అద్దం పడుతున్నాయి.    నిరసనలు ఉధృతం కావడంతో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే, మరోవైపు సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌ను మార్చడం వంటి చర్యలతో మార్కెట్లను శాంతింపజేసే ప్రయత్నం

చేస్తోంది. అయితే, ఇంధన , నీటి కొరత కూడా తోడవడంతో ప్రజల ఆగ్రహం తగ్గడం లేదు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ధరలను అదుపు చేయకపోతే, ఈ నిరసనలు మరింత తీవ్రమై రాజకీయ అస్థిరతకు దారితీసే ప్రమాదం కనిపిస్తోంది.

# 2027 ఆగస్టు 15 బుల్లెట్ ట్రైన..

ముంబై, జనవరి 1, (న్యూస్ పల్స్)  భారతదేశ కలల ప్రాజెక్టు అయిన బుల్లెట్ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్  లాంఛింగ్ తేదీని ప్రకటించారు.  2027 ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున బుల్లెట్ ట్రైన్ తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది.

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో తొలి బుల్లెట్ రైలు కార్యకలాపాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. 2027 స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశానికి తొలి బుల్లెట్ రైలు వస్తుంది.. ఆ రోజే టికెట్ కొనుక్కోవడానికి సిద్ధంగా ఉండండి అని రైల్వే మంత్రి ప్రకటించారు. తొలుత ఈ ప్రాజెక్టు 50 కిలోమీటర్లకే పరిమితం అవుతుందని భావించినప్పటికీ, పనుల

వేగం దృష్ట్యా గుజరాత్‌లోని  సూరత్ నుంచి వాపి వరకు సుమారు 100 కిలోమీటర్ల మేర ఈ ప్రారంభ ప్రయాణం సాగనుంది.

మొత్తం 508 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టును కేంద్రం ఐదు దశల్లో పూర్తి చేయనుంది.

1. మొదటి దశ: సూరత్ నుండి బిలిమోరా వరకు.
2. రెండో దశ: వాపి నుండి సూరత్ వరకు.
3. మూడో దశ: వాపి నుండి అహ్మదాబాద్ వరకు.
4. నాల్గవ దశ:  థానే నుండి అహ్మదాబాద్ వరకు.
5. చివరి దశ:× ముంబై  నుండి అహ్మదాబాద్ వరకు పూర్తి కారిడార్.

మొత్తం 508 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో బుల్లెట్ రైలు సేవలు డిసెంబర్ 202 నాటికి అందుబాటులోకి రానున్నాయి.

ప్రయాణ అనుభవం

ప్రస్తుతం ముంబై-అహ్మదాబాద్ మధ్య ప్రయాణానికి దాదాపు 6 నుండి 8 గంటల సమయం పడుతుండగా, బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే ఆ సమయం కేవలం  1 గంట 58 నిమిషాలకు  తగ్గిపోనుంది . అన్ని స్టేషన్లలో ఆగినప్పటికీ 2 గంటల 17 నిమిషాల్లో ప్రయాణం పూర్తవుతుంది. గంటకు 320 కిలోమీటర్ల వేగంతో  దూసుకుపోయే ఈ రైళ్ల కోసం అత్యాధునిక జపనీస్ షింకన్సెన్  సాంకేతికతను వాడుతున్నారు.  ఈ కారిడార్‌లో 12 స్టేషన్లు ఉండగా, అందులో 8 గుజరాత్‌లో, 4 మహారాష్ట్రలో ఉన్నాయి. ఇప్పటివరకు ఉన్న నివేదికల ప్రకారం, సుమారు 326 కిలోమీటర్ల మేర వయాడక్ట్ పనులు, 17 నది వంతెనల నిర్మాణం పూర్తయ్యాయి. ముఖ్యంగా థానే సమీపంలో సముద్రం కింద నిర్మిస్తున్న 21 కిలోమీటర్ల పొడవైన సొరంగం ప్రాజెక్టులో అత్యంత సవాలుతో కూడిన భాగంగా నిలుస్తోంది. జపాన్ ప్రభుత్వం దాదాపు 81 శాతం నిధులను

తక్కువ వడ్డీకే రుణంగా అందిస్తోంది.

# కేంద్ర, రాష్ట్రం దాడులు చేస్తున్నాయి

హైదరాబాద్, జనవరి 1, క్యాలెండర్‌లో తేదీలు, సంవత్సరాలు మారుతున్నాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేసిన ప్రజల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీవితాల్లో మార్పులు ఏమో గానీ, తెలంగాణ రాకముందు రోజులు మళ్లీ కనిపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎసస్ పార్టీ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రం రెండు సంవత్సరాలుగా అభివృద్ధి వైపు కాకుండా తిరోగమనం వైపు ప్రయాణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు, కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు ఉన్న పరిస్థితులు తిరిగి వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్రంతో, సమైక్యవాదులతో కేసీఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణ సాధించామని అన్నారుకేసీఆర్ పదేళ్ల కాలంలో తెలంగాణలో అభివృద్ధి పరుగులు పెట్టిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బలంగా గళమెత్తారని కేటీఆర్ అన్నారు. గెలుపోటములు శాశ్వతం కాదని, తాత్కాలికమని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా శాశ్వతమని అన్నారు. ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆట అయితే, బీఆర్ఎస్‌కు సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమని అన్నారు.కేంద్రం, రాష్ట్రం కలిసి, రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల

దీవెన, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదని కేటీఆర్ అన్నారు. 2028లో తిరిగి కేసీఆర్‌ను

ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని, ఆ దిశగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# టీటీడీ కొత్త ప్రయోగం సక్సెస్

తిరుమల, జనవరి 1, కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తుల గంటల తరబడి నిరీక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధునిక టెక్నాలజీతో చెక్ పెట్టింది. ఇటీవల వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చినా, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఎఐఐఐ), స్లాటెడ్ దర్శన విధానంతో గంటల వ్యవధిలోనే శ్రీవారి దర్శనం కల్పించి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కొత్త విధానం విజయవంతం కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30, 31 తేదీల్లో తిరుమలకు భక్తులు పోటెత్తారు. తొలిరోజే ఏకంగా 67,000 మంది స్వామివారిని దర్శించుకున్నారు. అయినా ఎక్కడా తోపులాటలు, గంటల తరబడి నిరీక్షణ లేకుండా కేవలం 1.5 నుంచి 4 గంటల్లోనే దర్శనం పూర్తయింది. ఇందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటరే కారణం. 2025 సెప్టెంబర్‌లో బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు 300కి పైగా సీసీటీవీ కెమెరాలు, 42 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను అనుసంధానించారు. ఈ వ్యవస్థ ఆలయ ప్రాంగణాన్ని 3డీ నమూనా రూపంలో తెరపై చూపిస్తుంది. ఏదైనా ప్రాంతంలో 500 మందికి పైగా భక్తులు గుమికూడితే ఆ ప్రాంతం ఎరుపు రంగులోకి మారి అధికారులను అప్రమత్తం చేస్తుంది. 500 లోపు భక్తులు ఉంటే పచ్చ రంగులో, క్యూలైన్లు సాఫీగా సాగుతుంటే పసుపు రంగులో కనిపిస్తుంది. దీంతో రద్దీ పెరిగే ప్రాంతాలను ముందే గుర్తించి, సిబ్బందిని అక్కడికి పంపించి క్యూలైన్లను వేగంగా ముందుకు కదిలేలా చర్యలు

తీసుకుంటున్నారు. ఈ టెక్నాలజీ, ముందుగా బుక్ చేసుకున్న టైమ్ స్లాట్ విధానం కలిసి రావడంతో వైకుంఠ ఏకాదశి దర్శనాలు విజయవంతంగా పూర్తయ్యాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. భక్తుల నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో, జనవరి 2 నుంచి సర్వదర్శనం భక్తులకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని, భవిష్యత్తులో లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు కూడా ఈ టెక్నాలజీని విస్తరించాలని టీటీడీ యోచిస్తోంది.

తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

తిరుమల పుణ్యక్షేత్రంలో వైకుంఠ ద్వాదశి పర్వదినం సందర్భంగా శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున ఈ పవిత్ర కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనిని "పుష్కరిణి తీర్థ ముక్కోటి" అని కూడా పిలుస్తారు. సందర్భంగా, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య చక్రత్తాళ్వార్‌కు పవిత్ర స్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, తిరుమల తిరుపతి

దేవస్థానం (టీటీడీ) 2026 జనవరి నెలలో శ్రీవారి ఆలయంలో జరుగనున్న విశేష పర్వదినాల జాబితాను కూడా విడుదల చేసింది. భక్తుల సౌకర్యార్థం ఈ వివరాలను ముందుగానే ప్రకటించింది.

జనవరి 4: శ్రీవారి ప్రణయ కలహ మహోత్సవం. జనవరి 8: శ్రీవారి ఆలయంలో పెద్ద శాత్తుమొర. జనవరి 12: ఆలయంలో అధ్యయనోత్సవాలు సమాప్తి. జనవరి 13: శ్రీవారు తిరుమల నంబి సన్నిధికి వేంచేపు. జనవరి 14: భోగి పండుగ. జనవరి 15: మకర సంక్రాంతి. ఈ రోజు నుంచి సుప్రభాత సేవ తిరిగి ప్రారంభమవుతుంది. జనవరి 16: కనుమ పండుగ. ఈ సందర్భంగా శ్రీవారు పార్వేట మండపానికి వేంచేస్తారు. జనవరి 18:

పురందరదాసుల ఆరాధన మహోత్సవం. జనవరి 23: వసంత పంచమి. జనవరి 25: రథ సప్తమి.

భారీగా లడ్డూల విక్రయం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాల్లో 2025వ సంవత్సరం సరికొత్త రికార్డును నెలకొల్పింది. 2025లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మొత్తం 13.52 కోట్ల లడ్డూలను భక్తులకు విక్రయించింది.

2024లో విక్రయించిన 12.15 కోట్ల లడ్డూలతో పోలిస్తే ఇది సుమారు 1.37 కోట్లు అధికం కావడం విశేషం. 2025లో లడ్డూల అమ్మకాల్లో దాదాపు పది శాతం వృద్ధి నమోదైంది. అంతేకాకుండా, డిసెంబర్

27వ తేదీన ఒక్కరోజే ఏకంగా 5.13 లక్షల లడ్డూలు విక్రయించి టీటీడీ మరో రికార్డు సృష్టించింది. ఏడాది పొడవునా భక్తుల రద్దీ గణనీయంగా పెరగడం, ముఖ్యంగా వైకుంఠ ద్వార దర్శనం వంటి ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాలు, సెలవు రోజుల్లో భక్తులు భారీగా తరలిరావడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల్లో ఉన్న అచంచల విశ్వాసం, పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా టీటీడీ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 3.5 లక్షల నుంచి 4 లక్షలకు పెంచడం వంటి చర్యలు కూడా అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయి. గతేడాది జులై నెలలో ఏకంగా రూ. 62.2 కోట్ల విలువైన లడ్డూలు అమ్ముడవడం కూడా

ఈ ఏడాది రికార్డులో కీలక పాత్ర పోషించింది

## ఫిబ్రవరి 1 నుంచి పెరుగనున్న సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు




న్యూఢిల్లీ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది. కాగా, ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు. మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి. అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.

## నకిలీ లిక్కర్ స్కాంలో అడ్డంగా బుక్కైన జోగిరమేష్

విజయవాడ, జనవరి 1, ఆంధ్రప్రదేశ్‌లో ప్రకంపనలు సృష్టించిన నకిలీ మద్యం దందాలో మాజీ మంత్రి జోగి రమేష్ పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టులో కీలక ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్ రావు, జోగి రమేష్ మధ్య 2006 నుంచే సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సిట్ స్పష్టం చేసింది. గతంలో వీరిద్దరూ కలిసి స్వర్ణ బార్ ప్రస్తుతం చెర్రీ బార్ నిర్వహణలో భాగస్వాములుగా ఉండటమే కాకుండా, 17లో ఇబ్రహీంపట్నం బార్ సిండికేట్‌లోనూ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ దీర్ఘకాలిక పరిచయమే అక్రమ మద్యం తయారీకి పునాదిగా మారిందని అధికారులు పేర్కొన్నారు. కేవలం ఆర్థిక లాభం కోసమే కాకుండా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకు జోగి రమేష్ ఈ దందాను ప్రోత్సహించారని సిట్ తన నివేదికలో ఆరోపించింది. ఏప్రిల్ 2024 తర్వాత ములకలచెరువు, ఇబ్రహీంపట్నం కేంద్రాలుగా నకిలీ మద్యం ఉత్పత్తిని ముమ్మరం చేయాలని రమేష్ ఒత్తిడి చేసినట్లు నిందితుల వాంగ్మూలం ద్వారా బయటపడింది. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందనే ముద్రను ప్రభుత్వానికి అంటగట్టాలనే రాజకీయ కుట్ర ఇందులో దాగి ఉందని సిట్ ఛార్జిషీట్‌లో వివరించింది. ఈ అక్రమ వ్యాపారం సాఫీగా సాగేందుకు భారీగా నగదు చేతులు మారినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. నిందితులు జనార్దన్ రావు, జగన్మోహన్ రావు ప్రతి రెండు మూడు నెలలకొకసారి రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు జోగి రమేష్‌కు, ఆయన సోదరుడు జోగి రాముకు అందజేసేవారని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ఈ నగదును నేరుగా జోగి రమేష్‌కే హ్యాండోవర్ చేసినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. మొత్తం 10 పేజీల ఈ ఛార్జిషీట్‌లో నిందితుల మధ్య జరిగిన కాల్ డేటా , ఆర్థిక లావాదేవీల రికార్డులను ప్రధాన ఆధారాలుగా చేర్చారు. ఈ నకిలీ మద్యం తయారీకి అవసరమైన ముడి పదార్థాలను గోవా, బెంగళూరు ,హైదరాబాద్ వంటి నగరాల నుండి సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ లేబుళ్లు, హాల్‌మార్క్ సీల్స్ తయారు చేసి సాధారణ మద్యం దుకాణాల ద్వారా విక్రయించేలా వ్యవస్థను రూపొందించారు. జోగి రమేష్ రాజకీయ అండదండలతోనే నిందితులు ఇన్ని రాష్ట్రాల వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించగలిగారని, ప్రస్తుతం జోగి రమేష్ ఈ కేసులో 18వ ఒదితుడిగా (o18) ఉన్నారని అధికారులు కోర్టుకు సమర్పించిన నివేదికలో స్పష్టం చేశారు.

# కొత్త సంవత్సరం వేళ ఢిల్లీలో 56 శాతం పెరిగిన డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు



న్యూఢిల్లీ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశ రాజధాని ఢిల్లీలో కొత్త సంవత్సరం వేళ డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు గత ఏడాదితో పోలిస్తే 56 శాతం పెరిగినట్లు పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేళ 868 డ్రంకెన్ డ్రైవింగ్ చలాన్లు జారీ చేసినట్లు పోలీసులు చెప్పారు. గత ఏడాది ఇదే రోజు ఆ సంఖ్య 558గా ఉన్నట్లు పేర్కొన్నారు. పటిష్టమైన రీతిలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయడం వల్ల కేసుల సంఖ్య పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవింగ్, స్పీడింగ్, మోటార్‌సైకిల్ స్టంట్స్, ప్రమాదకర ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ప్రత్యేక ట్రాఫిక్ బృందాలను మోహరించినట్లు అధికారులు చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు పెరగడం ఆందోళనకరమే అని కొందరన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రంతా అనేక ప్రదేశాల్లో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు చెప్పారు. చెకింగ్‌ను తప్పించుకునే బైకర్‌లను పట్టుకునేందుకు అనేక చోట్ల చెక్‌పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. సీసీటీవీ నిఘా ద్వారా సమర్థవంతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ కొనసాగించినట్లు చెప్పారు. న్యూ ఇయర్ సంబరాల నేపథ్యంలో ఢిల్లీ పోలీసు శాఖ అదనంగా సుమారు 20 వేల సిబ్బందిని శాంతి, భద్రతల కోసం మోహరించింది. జనం రద్దీగా ఉండే ప్రదేశాలైన కన్నాట్ ప్లేస్, హౌజ్ ఖాస్,ఏరోసిటీ వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. కేవలం జరిమానా విధించడం మాత్రమే కాదు అని, మద్యం తాగి వాహనం నడపరాదు అన్న బలమైన సందేశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో పకడ్బందీగా ప్లాన్ అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజకీయ కార్యదర్శి గా బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్



**ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జనవరి 1 తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజకీయ కార్యదర్శి గా బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ నియమితులైనారు . ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాజకీయ కార్యదర్శి గా నియమిఇస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం,కుషాగూడ డివిజన్ కు చెందిన బయ్య వెంకటేశ్వర్లు యాదవ్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటులో హితోదిక కృషి చేసారు. ఈ సందర్భంగా బయ్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నాకు అప్పగించిన ఈ బాధ్యత పట్ల పూర్తి నిబద్ధత నిజాయితీగా పని చేస్తానని నాతోటి రాష్ట్ర కమిటీ



మిత్రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటు,పార్టీనీ, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే భయ్యా వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్యాలెండర్ మరియు పార్టీ సంబంధించిన స్టిక్కర్స్ ఆవిష్కరణ పార్టీ అధినేత ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్బంగా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలబోయన ఓదేలు యాదవ్ , రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ , రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్ల వాసుదేవ్ మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కుత్బుల్లాపూర్ లో నూతన సంవత్సర వేడుకల్లో అపశృతి బిర్యాని తినిన 17 మంది అస్వస్థత..ఒకరు మృతి ..అపస్మారక స్థితిలో 15 మంది



**ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జనవరి 1 : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ లో నూతన సంవత్సర వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానినగర్ లో రాత్రి 17 మంది కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. మద్యం తాగి అనంతరం బిర్యాని తినిన 17 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. వీరిలో పాండు (53) అనే వ్యక్తి మృతి చెందాడు. అపస్మారక స్థితిలో ఉన్న 15 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# అందోల్ నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



## 2026 వ సంవత్సరం అందరికీ బాగుండాలి మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు

**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 01(ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా,:** 2025 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, 2026 నూతన సంవత్సరానికి, స్వాగతం పలుకుతూ, ఈ సంవత్సరం ప్రతి ఒక్కరికి కలిసి రావాలని, జోగిపేట పట్టణ మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు అన్నారు, ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ, 2026వ సంవత్సరంలో, సకాలంలో వర్షాలు కురిసి, రైతులు పాడిపంటలతో, శస్యశ్యామలంగా , ఉండాలని ప్రజలందరూ, సుఖ సంతోషాలతో,అష్ట ఐశ్వర్యాలతో, కలిగి ఉండాలని, ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను అని, ఈ సందర్భంగా చిట్టిబాబు అన్నారు, ఆందోల్ నియోజకవర్గ ప్రజలందరికీ, నూతన సంవత్సర శుభాకాంక్షలు, అని ఆయన తెలియజేశారు.

# ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు





**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 1 జనవరి 2026** 2026 ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భముగా గురువారం రోజున మాజీ మంత్రి ప్రస్తుత మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డినీ మరియు రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర పార్టీ యువ నాయకుడు పట్లోల్ల కార్తీక్ రెడ్డి లను మర్యాద పూర్వకముగా భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తత్ పర్యంతం నూతన సంవత్సర కేక్ కట్ చేయించడం జరిగినది. ఈ సందర్భముగా విచ్చేసిన పార్టీ నాయకులకు, కార్య కర్తలకు, అభీమాను లకు అందరికీ శుభాకాంక్షలు తెలియ జేసినారు. ఆ తరువాత పార్టీ మణికొండ యువ నాయకుడు ఉసేన్ జన్మదిన వేడుకల సందర్భముగా సహచర మిత్రులతో పాటు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి లు శుభాశీస్సులు అంద జేయడం, దుశ్శాలువ్వాతో సన్మానించడం జరిగినది.

# సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా ఆర్,పాండు



**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి,01 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా, ఆర్, పాండు,బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు, ఇప్పటివరకు ఆందోల్ ఆర్డీవోగ, విధులు నిర్వహించిన పాండును, ప్రభుత్వం జిల్లా రెవెన్యూ అధికారిగా, నియవించింది, ఇదివరకు జిల్లా రెవెన్యూ అధికారిగా ఉన్న, పద్మజ రాణిని, బదిలీపై అదనపు కలెక్టర్ గా, తన తదుపరి పోస్టింగ్ కోసం ప్రభుత్వం ముందు రిపోర్టు చేయాలని ఆదేశించింది.

# న్యూ ఇయర్ డాక్టర్ మెతుకు ఆనంద్ ని కలిసిన నర్సాపూర్ పెదతాండఉప సర్పంచ్ మోహన్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 1 (ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం నర్సాపూర్ పెద్ద తాండ ఉప సర్పంచ్ మోహన్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ,ను హ్యాపీ న్యూ ఇయర్ సందర్భంగా కలిసి విషెస్ తెలియజేశారు నూతన సంవత్సరములు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వికారాబాద్ నియోజకవర్గం ప్రజల మధ్యలో ఉండి ప్రశంసనీయమైన సేవలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కు ప్రేమపూర్వకంగా హ్యాపీ న్యూ ఇయర్ సందర్భంగా కలిసి ముచ్చటించిన టిఆర్ఎస్ నాయకులుగోపాల్, నర్సాపూర్ పెద్ద తాండ ఉపసర్పంచ్ మోహన్, సంతోషం వ్యక్తపరిచారు

# వేములవాడలో అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు.

## కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ పట్టణంలోని 26 అవార్డులో కాంగ్రెస్ నాయకులు సిర్రం ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో, అలాగే తిప్పాపూర్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులుగా, ఉప సర్పంచ్ గా మరియు వార్డు సభ్యులుగా ఎన్నికైన ఆటో యూనియన్ సభ్యులను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న, భీమేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం ఆటో యూనియన్ నిర్వహించే వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నూతన సంవత్సరములు మరిన్ని విజయాలతో ముందుకు సాగుతుందని ఆయన ధీమ వ్యక్తం చేశారు. కార్మిక, ధార్మిక క్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే నేత నెలకు చేతినిండా పని కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధిని చేపడుతున్నామని, ప్రజలు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నయని తెలిపారు. రైతులకు సాగునీరు అందించే క్రమంలో మల్కపేట రిజర్వాయర్ నుండి నిమ్మపల్లి వరకు, అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నీరా అందిస్తున్నామని చెప్పారు.



కలికోట సూరమ్మ చెరువు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణ కోసం 45 కోట్ల రూపాయలు మంజూరు చేసామని వెల్లడించారు. దీనివల్ల మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాలలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. నూతన సంవత్సరంలో వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ మరింత వేగంగా ముందుకు సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు.

## బీసీలకు రాజకీయంగా, విద్య, ఉపాధి, ఉద్యోగాలలో, రావలసిన వాటా-కోటా ఇవ్వాలని విజ్ఞప్తి.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),2026** ఆంగ్ల నూతన సంవత్సర శుభ సందర్భంగా బీసీ సాధికారిత సంఘం వేములవాడ పట్టణంలోని కార్యాలయంలో రాష్ట్ర కౌరవ బీసీ అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరిపి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో బీసీల సమస్యలు పరిష్కారం కావాలని, సమస్యల పరిష్కార సాధనకు బీసీలు సంఘటితంగా పోరాడాలని, ఐక్యమత్యమే మహాబలమని కొండ దేవయ్య పటేల్ అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో పాటుగా, సుఖ సంతోషాలతో జీవించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ రాజరాజేశ్వర స్వామిని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు.ఉత్తర తెలంగాణ జిల్లాలల ఇన్చార్జ్ పొలాస నరేందర్ మాట్లాడుతూ నూతన సంవత్సరములో బీసీ సోదర, సోదరీమణులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా, పదోన్నతులపరంగా, తదితర రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలని ఆయన కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బిసి సంఘం ఉపాధ్యక్షులు కూరగాయల కొమురయ్య మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీసీలలో వచ్చిన రాజకీయ చైతన్యంతో 260 మంది సర్పంచులకు గాను 120 మంది సర్పంచులు బీసీలు గెలుపొందడం గర్వకారణం అని వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు కూరగాయల కొమురయ్య, కందుకూరి రామా గౌడ్, మారం కుమార్, ఇల్లందుల వెంకటేష్, కొండ కనకయ్య, సిరిగిరి రామచంద్రం, కదారి రాములు, ఉయ్యాల భూమయ్య గౌడ్, నామాల పోశెట్టి, చింతలకోటి రామస్వామి గౌడ్, బుర్ర దశ గౌడ్, కుంభం రవీందర్, బొందిల మహేష్, చేను తెలపతి, ముద్రకొల నరసయ్య, ముద్రకొల లింబాద్రి, బుర్ర లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి )**

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన గోషామహల్ కాంగ్రెస్‌నాయకులు మేడికొండ కుమార్



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ చందన్ వాడి లో ఆరెకటిక సంఘం జనరల్ జనరల్ సెక్రెటరీ కోయిల్కార్ రాజేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజ రంగ రంగ వైభవంగా నిర్వహించారు స్వామీలు భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి గీతాలతో ఆడుతూ పాడుతూ భక్తిశ్రద్ధలతో ఆయురారోగ్యాలతో.. అష్టైశ్వర్యాలతో.. వర్ధిల్లాలని... మనస్ఫూర్తిగా అయ్యప్ప స్వామిని కోరుకుంటూ.... ముఖ్యఅతిథిగా ఆరెకటిక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు బి. గజ్బిన్కార్ అశోక్ , నర్సింగ్ రావు చౌదరి , రాష్ట్ర ట్రెజరర్ కేడి దినేష్, లక్ష్మణరావు, బలరాం, సరస్వతి బాయ్, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# భక్తుల రద్దీకి అనుగుణంగా భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేయాలి.

## రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గరీమ అగ్రవాల్. భీమేశ్వర ఆలయంలో ఇన్చార్జి కలెక్టర్, ఎస్పీ తో కలిసి ప్రత్యేక పూజలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ ఆదేశించారు. భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే దర్శించుకునేందుకు గురువారం వెళ్లగా, ఆలయ అర్చకులు స్వస్తితో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్, ఎస్పీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇంచార్జ్ కలెక్టర్, ఎస్పీ, వేములవాడ ఏ ఎస్ పి రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వచనం అందజేశారు.రాజన్న ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన. సమ్మ క్కసారలమ్మ జాతర, మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయంలో త్రాగునీటి సరఫరా, ప్రసాదం కౌంటర్ వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ ఏరియా, టాయిలెట్లు, షవర్ స్నానాలు ఏర్పాట్లను, కోడే మొక్కుల టికెట్ కౌంటర్, వీఐపీ, వి వి ఐ పి, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు, మీకు సరఫరాకు ఏర్పాట్లను కాలినడకన తిరుగుతూ క్షేత్రస్థాయిలో ఇన్చార్జి కలెక్టర్, ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద నూతన భవనం స్లాబ్ పనులు పూర్తిచేసి, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఇన్చార్జి కలెక్టర్ ఆలయ అధికారులను ఆదేశించారు. భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ నరసింహ చారి, ఆలయ ఈ ఈ రాజేష్, డి ఈ రఘునందన్, వేములవాడ అర్బన్ తాసిల్దార్ విజయ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ముదిరాజ్ వెల్ఫేర్ సొసైటీకి సౌండ్ బాక్స్ వితరణ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ పట్టణ ముదిరాజ్ వెల్ఫేర్ సొసైటీ అసోసియేషన్కు ప్రముఖ న్యాయవాది, ముదిరాజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రేగుల రాజకుమార్ తన తండ్రి రేగుల పోచయ్య జ్ఞాపకార్థం సౌండ్ బాక్స్ ను వితరణగా అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు పిల్లి రాజు మాట్లాడుతూ పోచయ్య స్మారకార్థం సౌండ్ బాక్స్ వితరణ చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సంఘ అభివృద్ధికి ఆనాడు 1984 లో ప్రారంభమైన ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ అంచలంచలుగా అభివృద్ధి చెందిందని, సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేసినటువంటి కీర్తిశేషులు రేగుల పోచయ్య కు ఆత్మ శాంతి చేకూరాలని రేగుల పోచయ్య పైన ఒక పాట కూడా పాడడం జరిగింది. రేగుల పోచయ్యను స్ఫూర్తిగా తీసుకొని వివిధ సంఘాలు ఇదే బాటలో నడవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గొట్టం అంజయ్య, మామిండ్ల దేవయ్య, కనకయ్య, రేగుల రమేష్ బాబు, గొట్టం శంకర్, బొడిగ భూమయ్య, పిల్లి పరిషయ్య, ఏదుల అశోక్, మామిండ్ల అంజయ్య, గొట్టం దేవయ్య, రెడ్డవేని మోహన్, జంగపల్లి రమేష్, తునికి చంద్రయ్య, గొట్టం శ్రీనివాస్, గొట్టం శివకుమార్, ఏదుల ఎల్లయ్య, రేగుల లక్ష్మీనారాయణ, దయ్యాల అంజయ్య, మామిండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ముసాయిదాలో అభ్యంతరాలు ఉంటె సంప్రదించండి

## మునిసిపల్ కమీషనర్ మహమ్మద్ ఆయాజ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 1** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపాలిటీ ఓటర్ జాబితాను గురువారం జమ్మికుంట మునిసిపల్ కార్యాలయంలోని నోటిస్ బోర్డు లో ప్రచురించడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓటర్ ముసాయిదాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న లిఖిత పూర్వకంగా స్వీకరించి వాటిని త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఓటర్ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్న లిఖిత పూర్వకంగా అర్జి చేసుకోవాలని అయన తెలిపారు. నేటి నుండి ఈ నెల 4వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టి.పి.వో శ్రీధర్, టి.పి.ఎస్. రాజ్ కుమార్, టి.పి.బి.వో దీపిక, ఎఈ వికాస్, జే.ఎ.వో రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అస్సిస్టేంట్లు వాణి, భాస్కర్, శ్రీనివాస్ లతో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ సబితా ఇంద్రారెడ్డిని కలిసిన రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 1 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మర్పల్లి మండల బి ఆర్ఎస్ అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి హ్యాపీ న్యూ ఇయర్ సందర్భంగా సబితా ఇంద్ర రెడ్డిని కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు, సబిత ఇంద్ర రెడ్డి హ్యాపీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యము ప్రజలు ఇచ్చినందుకు నూతన సంవత్సరంలో ప్రజల క్షేమం కోసం ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళల కృషి చేయాలని తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని హ్యాపీ న్యూ ఇయర్ సందర్భంగా తెలిపారు

# న్యూ ఇయర్ తెలంగాణ స్పీకర్ ను సన్మానించిన గుండ్ల మర్పల్లి నాయకులు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 1 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి పిల్లిగుండ్ల గ్రామం బీరప్ప యాదవ్ జన్మదిన సందర్భంగాన్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపి వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు ఘనంగా శాలువాతో సన్మానం చేశారు ఈ సందర్భంగా తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గుండ్లమర్ పల్లి బీరప్పకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి హ్యాపీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు గుండ్ల మర్పల్లిప్రజలకు తెలియజేశారు జాతీయ విద్యార్థి నాయకుడు ఈశ్వర్ న్యూ ఇయర్ సందర్భంగా తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపి సంతోషం వ్యక్తపరిచారు

# “వికసిత్ భారత్”గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలి

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపు



**ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జనవరి 1 “వికసిత్ భారత్”గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. భారతదేశ ప్రజలందరికి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు తెలిపారు.2025 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృఢమైన, దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగింది. అదే స్ఫూర్తితో, వారి అడుగుజాడల్లో నడుస్తూ 2026లో భారతదేశాన్ని “వికసిత్ భారత్”గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.భారత్ ప్రస్తుతం 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకునే దిశగా దేశం వేగంగా ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ 2026 నూతన సంవత్సరంలో మనందరం “నేషన్ ఫస్ట్” అనే భావనతో దేశానికి మన జీవితాన్ని అంకితం చేస్తూ, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుచుకుంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యం సాధన దిశగా ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు.

# రాందేవ్ రావు హాస్పిటల్‌లో "రిలేషన్షిప్స్ - ది ఎస్సేన్స్ అఫ్ లైఫ్ " పుస్తకావిష్కరణ మహోత్సవం



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 01:**రాందేవ్ రావు హాస్పిటల్‌లో జనవరి 1న ప్రముఖ రేఖి గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్ రచించిన రిలేషన్షిప్స్ ది ఎస్సేన్స్ అఫ్ లైఫ్ " పుస్తకాన్ని రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్ సువర్ణ హస్తాలతో సీఈఓ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్లు, సీనియర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ పుస్తకం కనుమరుగవుతున్న మానవ సంబంధాలు అనే అంశం మీద రచించడం జరిగింది. జీవితం అనేది కేవలం సంఘటనల పరంపర కాదని, అది సంబంధాల ప్రయాణమని స్పష్టంగా వివరిస్తుంది. మన జీవితంలోని ప్రతి సంబంధం తల్లి అనే మొదటి బంధం నుంచి ప్రారంభమై, కుటుంబం, సమాజం, విలువలు, చివరికి దేవుడితో ఉన్న సంబంధం వరకు విస్తరిస్తుందని ఈ పుస్తకం తెలియజేస్తుంది."నేటి తరం మానవసంబంధాల మేల్కొలుపు అనే ప్రధాన అంశంతో, ఆధునిక జీవనశైలి వల్ల సంబంధాల్లో ఏర్పడుతున్న అహంకారం, అపార్థాలు, తప్పుడు నిర్ణయాలు, సంభాషణ లోపం వంటి సమస్యలను ఈ పుస్తకం సున్నితంగా విశ్లేషిస్తుంది. సంబంధాలను ఎలా విలువైనవిగా మలచుకోవాలి, ఎలా కాపాడుకోవాలి, ఎలా ముందుకు సాగాలి అనే విషయాలకు మార్గదర్శకత్వం అందిస్తుంది. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ, ఈ పుస్తకం సరళమైన, హృదయానికి చేరువైన భాషలో అన్ని వయస్సుల పాఠకులను దృష్టిలో ఉంచుకుని రచించబడిందని తెలిపారు. సంబంధాలు నియంత్రణతో కాదు, నమ్మకం, ఓపిక, సహనం, పరస్పర గౌరవం, మనసు విస్మృతితోనే నిలబడతాయని ఆమె వివరించారు. మానవ సంబంధాలు మన బాధ్యత కాదు అవి దేవుని బాధ్యత" అన్న ఆలోచన పుస్తకానికి మూల భావమని తెలిపారు.ఈ పుస్తకంలోని ప్రత్యేకత ఏమిటంటే, రచయిత బంధువులు, స్నేహితులు, వైద్యులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు పంచుకున్న అభిప్రాయాలు, కవితలు, ఆలోచనలు ఇందులో చోటు దక్కాయి. సంబంధాలను కొందరు జీవితానికి దారి చూపే వీధి దీపాలుగా, మరికొందరు ఆత్మకు రెక్కలు ఇచ్చే బంధాలుగా, ఇంకొందరు దేవుడిచ్చిన వరాలుగా వర్ణించారు.పుస్తకావిష్కరణ సందర్భంగా పలువురు రచనలు అందించినవారు మాట్లాడుతూ, ఈ పుస్తకం చాలా బాగుంది, సరళంగా ఉంది, హృదయాన్ని తాకుతుంది అని ప్రశంసించారు. తమ ఆలోచనలు ఈ పుస్తకంలో భాగమవ్వడం పట్ల గర్వంగా, గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఇది ఒక వ్యక్తి రచన మాత్రమే కాకుండా సామూహిక అనుభవాల ప్రతిబింబమని పేర్కొన్నారు.ఈ పుస్తకం సంబంధాల్లో:

తీర్పులు మరియు అపార్థాలు
బాధ నుంచి నేర్చుకోవడం
క్షమ, సంభాషణ ప్రాముఖ్య

అవసరమైనప్పుడు విడిచిపెట్టే ధైర్యం దేవుడితో ఉన్న సంబంధమే పరమ సంబంధంవంటి అంశాలను లోతుగా స్పృశిస్తుంది.రేఖి గ్రాండ్ మాస్టర్, కౌన్సిలర్, విద్యావేత్త అయిన లక్ష్మీ కమలాకర్, తన జీవిత అనుభవాలు, ఆధ్యాత్మిక దృష్టి, సామాజిక సేవల సారాన్ని ఈ పుస్తకంలో మేళవించారు.ఈ పుస్తకం నేటి భావోద్వేగపూరిత సమాజానికి అవసరమైన ఆత్మపరిశీలన గ్రంథంగా నిలుస్తుందని హాస్పిటల్ యాజమాన్యం ప్రశంసించింది.

# ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నర్సారెడ్డి భూపతిరెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి .
ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేష్ రెడ్డి పాల్గొన్నారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ దశరథం మామిండ్ల కు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేసిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఉద్యోగులు



# కేటీఆర్ రైతులకు యూరియా సరఫరా పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారు

## చామల కిరణ్ కుమార్ రెడ్డి,భువనగిరి ఎంపీ..



.కేటీఆర్ కు చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్నూతన సంవత్సరం తొలి రోజునే కేటీఆర్ గోబెల్స్ ప్రచారాన్ని మొదలుపెట్టారుఒక పక్క హరీష్ రావు,మరోపక్క కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం,ప్రజా పాలనపైన విమర్శలు చేస్తున్నారుమీ బావ హరీష్ రావు కృష్ణా,గోదావరి నదీ జలాలు,పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారుకేటీఆర్ రైతులకు యూరియా సరఫరా పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారుమీరు ప్రజా సమస్యలు,వాస్తవాల గురించి మాట్లాడండిబిఆర్ఎస్ ను పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు భూ స్థాపితం చేశారులోక్ సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించి గుండు సున్నా తెచ్చుకుందిరైతులకు యూరియా కోసం ధర్నాలు చేశామునడ్డాతో మాట్లాడి యూరియా తెప్పించాము2024-2025 సంవత్సరానికి వానాకాలం పంటకు 9.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి తెప్పించాముయాసంగికి 10.41 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తీసుకువచ్చాముబిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఈ స్థాయిలో ఎప్పుడూ యూరియా తేలేదు2025-2026 వానాకాలం పంటకు 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చాముయూరియాను తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఫెయిల్ కాలేదులెక్కలు ప్రజలు తెలుసుకోలేరని కేటీఆర్ జనవరి 1 వ తేదీ నుంచే అసత్య ప్రచారం చేస్తున్నారుకేటీఆర్ తప్పుడు సమాచారంతో,తప్పుడు మాటలతో తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టవద్దు



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి )** ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన గోషామహల్ కాంగ్రెస్నాయకులు ఎస్.ధన్‌రాజ్, టీ.సతీష్,మేడికొండ కుమార్ తదితరులు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com